మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 155 | గురువారం 11 - 06 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028




నారా లోకేష్ రష్యా పర్యటనపై జాతీయ మీడియాలో ప్రత్యేక కథనం



## పొదుపు లక్షల్లో.. ఆస్తులు కోట్లలో!



### ఇక్కడే దొరికిన మోహన్ నాయక్

### ఏసీబీ విచారణలో కీలక అంశాల గుర్తింపు

రహదారుల భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ మోహన్‌నాయక్‌ను బుధవారం ఏసీబీ అధికారులు న్యాయస్థానంలో హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కాగా ఆర్‌అండ్‌బీలో 1995లో రీసెర్చ్ ఆఫీసర్‌గా చేరిన మోహన్ నాయక్ అంచెలంచెలుగా ఎదిగి చీఫ్ ఇంజనీర్ స్థాయికి చేరుకున్నారు.

## మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై సుప్రీంకోర్టుకు కాంగ్రెస్



- రాజ్యసభ పోరులో కొత్త మలుపు
- కేసే లేదంటూ కోర్టుకెక్కిన కాంగ్రెస్
- మీనాక్షి వివాదం.. ఢిల్లీలో రాజకీయ దుమారం
- నామినేషన్ తిరస్కరణపై కాంగ్రెస్ న్యాయపోరాటం

మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. రిటర్నింగ్ అధికారి తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ అత్యవసర విచారణ కోరింది.

# గుజరాత్ మోడల్‌తో దూసుకు వచ్చిన మోడీ

- దేశ ప్రజల ఆలోచనలపై గురిపెట్టిన గుజరాత్ మోడల్
- వరుసగా ఆరు సాధారణ ఎన్నికల్లో ఘన విజయం
- మూడుసార్లు గుజరాత్ సిఎంగా..మరో మూడు సార్లు ప్రధానిగా రికార్డు



ప్రజాస్వామ్య దేశంలో మెజార్టీ ప్రజల్ని మెప్పిస్తేనే అధికార పీఠం దక్కుతుంది. ఒక్కసారి పవర్లోకి రావడమే గొప్ప అనుకుంటున్న తరుణంలో.. దశాబ్దాల పాటు ప్రభుత్వాధినేతగా కొనసాగటం, అందులోనూ సుదీర్ఘకాలం ఎన్నికైన ప్రధానిగా ఉండటం

## భారీ మూల్యం తప్పదన్న డొనాల్డ్

### ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక



- ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు
- 'మిడిల్ ఈస్ట్ రౌడీ చనిపోయాడు' అంటూ ట్రూత్ సోషల్‌లో పోస్ట్
- చర్చల విషయంలో జాప్యం చేస్తే భారీ మూల్యం తప్పదని హెచ్చరిక
- అమెరికా హెలికాప్టర్ కూల్చివేతతో పెరిగిన ఉద్రిక్తతలు

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పరాకాష్టకు చేరాయి. చర్చల ప్రక్రియలో ఇరాన్ జాప్యం వహిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. "మిడిల్ ఈస్ట్ రౌడీ చనిపోయాడు"

## చిన్నవానకే ముంపు.. 200 కోట్ల నిర్లక్ష్యం!



- హైదరాబాద్ నగరంలో వర్షాకాల సన్నద్ధత కోసం ఏటా ప్రత్యేకంగా పనులు
- పూడికతీత నుంచి గుంతల పూడ్చివేత, రోడ్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల కొట్టివేతదాకా..
- పనుల్లో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం
- వరద నీటి నిర్వహణలో వైఫల్యం

# ఫ్యూచర్ సిటీకి తొలి అడుగు..


## కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్

- హైదరాబాద్‌ను ప్రపంచ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతామని ప్రకటన
- అభివృద్ధిని అడ్డుకుంటున్నారంటూ బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు
- చెరువుల ఆక్రమణలు తొలగించి 'లేక్ ఎకానమీ' అభివృద్ధి చేస్తామని వెల్లడి



తెలంగాణాను ప్రపంచ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'భారత్ ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు వాస్తవరూపం దాల్చుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు రాష్ట్ర భవిష్యత్తు ముఖచిత్రాన్ని మార్చబోతోందని ధీమా వ్యక్తం చేశారు.కేవలం 150 రోజుల రికార్డు సమయంలో ఫ్యూచర్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ భవనాన్ని పూర్తి చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి, వేగానికి

## కరువు.. కుంభవృష్టి



- ఎల్‌నినోతో దేశంలో మారుతున్న వాతావరణం
- సాధారణం కంటే ఈ ఏడాది తక్కువ వర్షపాతం
- ఇప్పటికే బలహీనపడిన నైరుతి రుతుపవనాలు
- కొన్నిచోట్ల ఉన్నట్టుండి కుంభవృష్టి కురిసే అవకాశం
- తెలంగాణలోనూ అదే పరిస్థితి
- పంటల దిగుబడి తగ్గి ఆహార ధాన్యాలకు కొరత!
- పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ఏర్పడింది: జపాన్

## ఐటీ కారిడార్‌లో 'గంజాయి సామ్రాజ్యం'..

### మరోసారి తెరమీదకు "నీతూబాయ్"





## ఏం చేద్దాం?.. రాహుల్‌తో అభిషేక్ బెనర్జీ రహస్య మంతనాలు!

- తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన తృణమూల్ కాంగ్రెస్
- ఎమ్మెల్యేలు, ఎంపీల తిరుగుబాటుతో సతమతం
- ఢిల్లీలో నిన్న సోనియాతో మమతా బెనర్జీ భేటీ
- నేడు అభిషేక్ బెనర్జీ మంతనాలు



# భారీ మూల్యం తప్పదన్న డొనాల్డ్

అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సంచలనం సృష్టిస్తున్నాయి. ఇరాన్‌లోని మౌలిక సదుపాయాలపై మరిన్ని దాడులు చేసే అవకాశం ఉందని సంకేతాలను ఆయన ఇచ్చారు.బుధవారం 'ట్రూత్ సోషల్' వేదికగా స్పందించిన ట్రంప్, "ఇరాన్ సైన్యం ప్రస్తుతం తీవ్ర అస్తవ్యస్త స్థితిలో ఉంది. వారి నౌకాదళం, వాయుసేనలు దాదాపుగా ఉనికి కోల్పోయాయి. చర్చలకు రావడంలో వారు ఇప్పటికే చాలా ఆలస్యం చేశారు, ఇప్పుడు దానికి తగిన ప్రతిఫలం అనుభవించక తప్పదు" అని పేర్కొన్నారు.అమెరికాకు చెందిన ఏహెచ్-64 అపాచీ హెలికాప్టర్‌ను కూల్చివేసిన ఘటన తర్వాత ఈ ఘర్షణ వాతావరణం నెలకొంది. దీనికి ప్రతిచర్యగా, మంగళవారం హార్ముజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ వాయు రక్షణ వ్యవస్థలు, రాడార్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా దళాలు దాడులు నిర్వహించాయి. ఇది కేవలం ఆత్మరక్షణ కోసం చేపట్టిన చర్యేనని యూఎస్ సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. హెలికాప్టర్‌లోని ఇద్దరు సిబ్బందిని సురక్షితంగా రక్షించినట్లు వెల్లడించింది. అయితే, తమ డ్రోన్‌ను అమెరికా హెలికాప్టర్ ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఇరాన్ వాదిస్తోంది. ఇందుకు ప్రతీకారంగా బహ్రెయిన్, జోర్డాన్, కువైట్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణి దాడులు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇరాన్ అణు, సైనిక కేంద్రాలపై అమెరికా-ఇజ్రాయెల్ దళాలు దాడులు చేసినప్పటి నుంచి ఈ వివాదం కొనసాగుతోంది. తాజా పరిణామాల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగగా, స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి.

# చిన్నవానకే ముంపు.. 200 కోట్ల నిర్లక్ష్యం!

వానలు మొదలైతే జనం పరవశించాలి. ఎండల తీవ్రత తగ్గుతుందని ఆనందపడాలి. కానీ హైదరాబాద్ మహానగరంలో చినుకుపడితే జనం వెన్నులో వణుకు పుడుతోంది. చెరువుల్లా మారే రహదారులు, ఉప్పొంగే డ్రైనేజీలు, తెరిచి ఉండే మ్యాన్‌హోల్/క్యాచ్‌పిట్‌లు, తెగిపడే చెట్ల కొమ్మలు, విద్యుత్ వైర్లు.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి. ఈ తిప్పలు తప్పించేందుకు ఏటా వానాకాలానికి ముందే సన్నద్ధత కోసం చర్యలు చేపట్టాల్సిన యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఏటా సుమారు రూ.200 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్టు లెక్కల్లో చూపుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి దారుణంగా ఉంటోంది. వానాకాల సన్నద్ధత పనులకు సంబంధించిన టెండర్లు కూడా పూర్తిగాకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

**అరగంట వానకే అతలాకుతలం**మంగళవారం హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాల్లో సుమారు అరగంట పాటు గట్టి వర్షం కురిసింది. దీనితో చాలాచోట్ల రోడ్లపై నీళ్లు నిలిచాయి. కార్లు పడవల్లా నీళ్లలో తేలియాడాయి. కిలోమీటర్లకొద్దీ ట్రాఫిక్ స్తంభిం చింది. విద్యుత్ తీగలు తెగిపడి బండ్లగూడ జహంగీర్‌బాద్ ప్రాంతంలో ఇద్దరు విద్యుత్‌షాక్‌తో మృతిచెందా రు. ఇప్పుడే కాదు ఏటా ఇదే తరహాలో ఇబ్బందులు త లెత్తుతున్నా అధికార యంత్రాంగం మొద్దునిద్ర వీడటం లేదు. వానాకాలానికి ముందే జాగ్రత్త పడటం లేదు.

**కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నా ఫలితమేది?** ఏటా వానాకాలం సన్నద్ధత కోసం డ్రైనేజీలు, నాలాలు, మ్యాన్‌హోళ్లలో పూడికతీత, అత్యవసర, స్టాటిక్ బృందాల ఏర్పాటు, మోటార్లు, ఇతర పరికరాల కొనుగోళ్లు, రోడ్లపై గుంతల మరమ్మతులు, చెట్ల కొమ్మ ల కొట్టివేత తదితర పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఇక వానాకాలం ఆసాంతం కూలిన చెట్లు కొమ్మలు, విద్యుత్ స్తంభాల తొలగింపు, మురుగు నీటి నిర్వహణ వంటి పనులు ఉంటాయి. వీటన్నింటికి కోసం అత్యవసర, ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేయాలి. 24 గంటలపాటు మూడు షిఫ్టుల్లో బృందాలు అందుబాటులో ఉండాలి. దీనితో వానాకాలం వచ్చిందంటే కొన్ని ప్రభుత్వ విభాగాల అధికారులకు పండుగ వచ్చినట్టేనని.. పనుల్లో భారీగా కమీషన్లు చేతులు మారుతాయని ఆరోపణలు ఉన్నాయి. ఏటా వానాకాలంలో జీహెచ్‌ఎంసీ, హైడ్రా, టీజీఎస్‌పీడీసీఎల్, వాటర్‌బోర్డు తదితర విభాగాలు ప్రత్యేక బృందాల ఏర్పాటు, ఇతర పనుల కోసం రూ.200 కోట్ల వరకు ఖర్చు చేస్తాయని అంచనా. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో గుర్తించిన 859 వరదనీరు నిలిచే ప్రాంతాల వద్ద ఆ బృందాలు పనిచేయాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. ఆ బృందాలు వాటర్ ల్యాగింగ్ పాయింట్ల వద్ద ఉండి ఎప్పటికప్పుడు వరదనీరు తొలగేలా చర్యలు చేపడితే.. రోడ్లపై ముంపు, ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని పదవీ విరమణ చేసిన ఇంజనీరింగ్ విభాగం అధికారి ఒకరు పేర్కొన్నారు.

**మాన్‌సూన్ బృందాల ఏర్పాటు ఎప్పుడు?** వానాకాలం నేపథ్యంలో ఏటా జూన్ నుంచి అక్టోబరు వరకు అత్యవసర, స్టాటిక్ బృందాలు అందుబాటులో ఉండాలి. వాతావరణ శాఖ సూచనలను బట్టి అవసరమైతే నవంబరులోనూ కొనసాగిస్తారు. ఇందుకోసం ఏటా మే నెలలోనే టెండర్లు పిలిచి, అర్హత ఉన్న ఏజెన్సీలను ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించాలి. కానీ ఈసారి ఇంకా టెం డర్ ప్రక్రియ పూర్తి కాలేదు. అటు వానాకాలం మొదలైంది. ఒక్క గట్టివానతోనే నగరంలోని పలు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. దీనితో ఏజెన్సీలను ఎప్పుడు ఎంపిక చేస్తారు? బృందాలు ఎప్పుడు రంగంలోకి దిగుతాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**స్విమింగ్ పూల్స్‌లా ఫ్లైఓవర్లు..** రోడ్లపై వరద నీరు నిలవడం సాధారణమే. కానీ హైదరాబాద్‌లో ఫ్లైఓవర్లపైనా వరద నిలిచి స్విమింగ్ పూల్స్‌లా మారిపోతున్నాయి. గత ఏడాది ఐటీ కారిడార్‌లోని కొత్తగూడ వంతెనపై భారీగా వరద నిలిచి, నాలుగైదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిందిపోయింది. తాజాగా మంగళవారం కురిసిన వర్షానికి ఇందిరాపార్కు- వీఎస్టీ వంతెనపైనా నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలిగింది. ఫ్లైఓవర్ల నుంచి నీళ్లు వెళ్లిపోయేందుకు ఏర్పాటు చేసే మార్గాలు (వెంట్‌లు/స్పౌట్‌లు) మట్టి, చెత్తాచెదారంతో నిండి మూసుకుపోవడమే దీనికి కారణం. వాటిని శుభ్రం చేస్తే ఈ సమస్య తప్పేది. కానీ పట్టించుకునేవారే లేరు.

**వాన గంటన్నర.. విద్యుత్ అంతరాయం 22 గంటలు!** మంగళవారం సాయంత్రం వాన కురిసింది గంటన్నర పాటే.. కానీ హైదరాబాద్ నగరంలోని న్యూబాకారం, విద్యానగర్ అచ్యుత్‌రెడ్డి మార్గ్, సత్యనగర్‌కాలనీ, బాలాజీనగర్‌లో 22 గంటల పాటు.. సికింద్రాబాద్, ఆర్పీ నిలయం, నారాయణగూడ, గాంధీనగర్, అశోక్‌నగ ర్, వివేక్‌నగర్, చిక్కడపల్లి, దోమలగూడ, హిమాయత్‌నగర్, జవహర్‌నగర్, కవాడిగూడ ప్రాంతాల్లో 16 గంటల పాటు, చిలకలగూడ శ్రీనివాస్ నగర్ కాలనీలో 8 గంటలకుపైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చెట్లు, కొమ్మలు, విద్యుత్ స్తంభాలు కూలిపడటంతో ఈ సమస్య ఏర్పడింది. దీనితో ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. సహాయక చర్యల్లో తీవ్ర జాప్యంపై ఆందోళన వ్యక్తం చేశారు.

**నీటి ముంపు, ట్రాఫిక్ సమస్యపై సమీక్ష** మంగళవారం సాయంత్రం కురిసిన వానతో ఐటీ కారిడార్‌లోని నాలెడ్జ్ సిటీ, మైండ్ స్పేస్ జంక్షన్, టీ-హబ్ జంక్షన్, బయోడైవర్సిటీ జంక్షన్, గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్, కేబీఆర్ పార్క్ వైపు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ నేపథ్యంలో బుధవారం సైబరాబాద్ సీపీ ఎం.రమేశ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో.. సీఎంసీ, ట్రాఫిక్, హైడ్రా, జలమండలి, ఎస్పీడీసీఎల్, టీజీఐఐసీ, ఇరిగేషన్, హెచ్‌జీసీఎల్, హెచ్‌ఎండీఏ, అర్బన్ ఫారెస్ట్ తదితర విభాగాల ప్రతినిధులతో ప్రత్యక్షంగా, జూమ్‌లో సమీక్షించారు. వర్షాకాలంలో ప్రజల భద్రత, ట్రాఫిక్ నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని సైబరాబాద్ సీపీ ఎం.రమేశ్ కోరారు. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంబంధిత శాఖలతో కలిసి నిరంతరం పర్యటించాలని, నీటి ముంపు, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. కాగా, ఇటీవలి వర్షాలతో నగరంలో నీటి ప్రవాహం, వాటర్ ల్యాగింగ్ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు హైడ్రా ప్రత్యేక ఎమర్జెన్సీ బృందాలను ఏర్పాటు చేసిందని వెల్లడించారు.

# ఏం చేద్దాం?.. రాహుల్‌తో అభిషేక్ బెనర్జీ రహస్య మంతనాలు!

బెంగాల్‌లో తృణమూల్‌లో నెలకొన్న సంక్షోభం నేపథ్యంలో ఢిల్లీలో బుధవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో అత్యవసరంగా సమావేశమయ్యారు. దాదాపు గంటన్నర పాటు సాగిన ఈ భేటీ తీవ్ర రాజకీయ ఉత్కంఠను రేకెత్తించింది. నిన్నే టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ స్వయంగా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీతో సుదీర్ఘంగా చర్చలు జరపడం గమనార్హం. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ సమావేశంలో ప్రధానంగా రెండు అంశాలపై చర్చలు నడిచాయి. బెంగాల్‌లో ఘోర ఓటమి తర్వాత బీజేపీ అక్కడ 'ఆపరేషన్ లోటస్' ముమ్మరం చేసిందని, తృణమూల్‌ను నిలువునా చీల్చేందుకు ప్రయత్నిస్తోందని రాహుల్ గాంధీకి అభిషేక్ వివరించినట్లు తెలుస్తోంది. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు కాంగ్రెస్ రాజకీయ మద్దతును కోరినట్లు సమాచారం. మరోవైపు జాతీయ స్థాయిలో ప్రతిపక్షాల ఐక్యతను కాపాడుకుంటూ భవిష్యత్తులో పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఇరువురు నేతలు చర్చించారు. గతంలో కాంగ్రెస్‌తో పొత్తుకు అంతగా ఆసక్తి చూపని మమతా బెనర్జీ ప్రస్తుత సంక్షోభం తర్వాత తన వైఖరిని పూర్తిగా మార్చుకున్నారు.

# ఫ్యూచర్ సిటీకి తొలి అడుగు..

నిదర్శనమని ముఖ్యమంత్రి తెలిపారు. రాబోయే ఎనిమిదేళ్లలో ఫ్యూచర్ సిటీని న్యూయార్క్, టోక్యో, సింగపూర్ వంటి అంతర్జాతీయ నగరాలకు దీటుగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్య సాధనలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. గతంలో హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్, జీనోమ్ వ్యాలీ వంటి ప్రాజెక్టులతో హైదరాబాద్ విస్తరించడం వల్లే ప్రపంచ పటంలో నగరానికి ప్రత్యేక స్థానం లభించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు తిరస్కరించిన ఆ పార్టీ, అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తే రాజకీయంగా మరింత కనుమరుగవుతుందని హెచ్చరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు హైదరాబాద్‌లో రహదారులు జలమయం కావడాన్ని ప్రస్తావిస్తూ.. చెరువులు, నీటి వనరులు ఆక్రమణలే ఇందుకు ప్రధాన కారణమని ముఖ్యమంత్రి అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన భూకబ్జాలను తొలగించి, చెరువులను పునరుద్ధరించడం ద్వారా 'లేక్ ఎకానమీ'ని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ ఏడాది డిసెంబర్‌లో మరో గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ నగరాన్ని నిరంతరం విస్తరించడం వల్లే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని ఆయన అన్నారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో భూముల ధరలు బంగారం ధరను మించిపోయాయని పేర్కొన్నారు. ఆనాటి నిజాం రాజులు, కులీకుతుబ్‌షాలు హైదరాబాద్ నగరాన్ని అనేక పర్యాయాలు విస్తరించారని గుర్తుచేశారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి బీఆర్ఎస్ కుట్రలు చేస్తోందని, ఇలాగే వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కదని ముఖ్యమంత్రి విమర్శించారు.

# కరువు.. కుంభవృష్టి

దేశ వ్యవసాయ రంగాన్ని ఎల్‌నినో చుట్టుముడుతోంది. దేశానికి అత్యధిక వర్షాలు అందించే నైరుతి రుతుపవనాలు ఇప్పటికే ఆలస్యంగా దేశంలోకి ప్రవేశించాయి. వచ్చిన తర్వాత కూడా వేగంగా విస్తరించటం లేదు. రెండుమూడేళ్లకోసారి ఎల్‌నినో పరిస్థితులు ఏర్పటం సర్వసాధారణమే అయినా.. ఈసారి వచ్చేది సూపర్ ఎల్‌నినో అని, దాని ప్రభావం దారుణంగా ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దేశంలోని చాలా భాగం తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడుతాయని, కొన్ని ప్రాంతాల్లో మాత్రం అతి తక్కువ సమయంలో కుంభవృష్టి కురిసి వరదలు వస్తాయని అంటున్నారు. తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం ఇప్పటికే కనిపిస్తోందని పేర్కొంటున్నారు. పసిఫిక్ మహాసముద్ర ఉపరిత ల ఉష్ణోగ్రతలు తక్కువసమయంలో ఒకటిరెండు డిగ్రీల సెల్సియస్ వరకు వేడెక్కడటం వల్ల భూమధ్యరేఖా మండలంలో తూర్పు నుంచి పశ్చిమానికి స్థిరంగా వీచే సముద్ర వ్యాపార పవనాలు బలహీనడటం లేదా తిరోగమించటమే ఎల్‌నినో. దక్షిణాసియాకు అత్యధిక వర్షాలనిచ్చేది ఈ పవనాలే. అవి బలహీనపడటంవల్ల భారతదేశ రుతుపవన వ్యవస్థ తీవ్రంగా ప్రభావితం అవుతుంది. సమయానికి వర్షాలు పడవు. ఒక వర్షానికి మరో వర్షానికి మధ్య ఉండే విరామ కాలం సుదీర్ఘంగా ఉంటుంది. దీంతో వాతావరణం పొడిగా మారి పంటలు ఎండిపోతాయి. కొన్నిచోట్ల ఉన్నట్లుండి కుంభవృష్టి కురుస్తుంది. దీనివల్ల ఆకస్మికవరదలు వస్తాయి. అంటే దేశంలో ఒకప్రాంతం నీట మునిగితే మరోప్రాంతం కరువుతో అల్లాడుతుందన్నమాట. ఈసారి మనదేశంలో ఇలాంటిపరిస్థితులే కనిపించనున్నాయని నిపుణులు చెబుతున్నారు.

# ఐటీ కారిడార్‌లో 'గంజాయి సామ్రాజ్యం'..

హైదరాబాద్ ఐటీ కారిడార్‌గా పేరొందిన గచ్చిబౌలినానక్‌రామ్‌గూడ ప్రాంతాల్లో గంజాయి అక్రమ వ్యాపారం నిర్వహిస్తూ కోట్ల రూపాయల సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నీతూబాయ్ అలియాస్ కాలావతి పేరు మరోసారి సంచలనంగా మారింది. ఇటీవల ఈగల్ ఫోర్స్, పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన సీక్రెట్ ఆపరేషన్‌లో ఆమె నెట్‌వర్క్‌కు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు వస్తున్నారన్న సమాచారం అందడంతో నీతూబాయ్ పరారైనా, ఆమె కుటుంబ సభ్యులు, అనుచరులు, గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన పలువురు ఐటీ ఉద్యోగులను అదుపులోకి తీసుకోవడం నగరంలో చర్చనీయాంశమైంది. ఒకప్పుడు దూల్‌పేటకే పరిమితమైన గంజాయి వ్యాపారం, క్రమంగా ఐటీ కారిడార్ వరకు విస్తరించిందని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. అధిక ఆదాయం కలిగిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, హాస్టళ్లలో ఉండే విద్యార్థులు, వలస కార్మికులను ప్రధాన లక్ష్యంగా ఎంచుకుని నీతూబాయ్ తన వ్యాపారాన్ని విస్తరించినట్లు సమాచారం. రోజూ వందలాది మంది కస్టమర్లు ఆమె వద్దకు వస్తుండటం వల్ల ఈ ప్రాంతం కొత్త 'డ్రగ్ హాట్‌స్పాట్'గా మారిందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

**ఎవరీ నీతూబాయ్?** నీతూబాయ్ నేర చరిత్ర కూడా చిన్నది కాదు. దాదాపు ఎనిమిదేళ్లుగా గంజాయి రవాణా, విక్రయాలకు సంబంధించిన అనేక కేసుల్లో ఆమె పేరు నమోదైంది. నానక్‌రామ్‌గూడ కేంద్రంగా గంజాయి అక్రమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నీతూబాయ్ అలియాస్ కాలావతి కథ సాధారణ నేరగాథ కాదు. ఇది ఒక కుటుంబం మొత్తం కలిసి నిర్మించుకున్న అక్రమ వ్యాపార సామ్రాజ్యంగా దర్యాప్తు సంస్థలు భావిస్తున్నాయి. ముఖ్యంగా ఆమె అత్త మధుబాయ్‌తో కలిసి ఏర్పరచుకున్న నెట్‌వర్క్, దూల్‌పేటతో ఉన్న సంబంధాలు, కిరాణా దుకాణాల ముసుగులో సాగిన వ్యాపారం, కోట్ల రూపాయల ఆస్తుల సమీకరణ వంటి అంశాలు అధికారులను సైతం ఆశ్చర్యానికి గురిచేశాయి. హైదరాబాద్‌లో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, గంజాయి విక్రయాల చరిత్రలో దూల్‌పేట పేరు తరచుగా వినిపిస్తూ ఉంటుంది. అక్కడ గంజాయి విక్రయించే కొన్ని కుటుంబాలతో నీతూబాయ్, మధుబాయ్ కుటుంబాలకు సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయని దర్యాప్తు అధికారులు గుర్తించారు. మొదట ఇతరుల కోసం గంజాయి సరఫరా చేసే స్థాయిలో ఉన్న వీరు, ఆ తర్వాత స్వయంగా కొనుగోలు చేసి విక్రయించే స్థాయికి ఎదిగినట్లు సమాచారం. నీతూబాయ్ గతంలో అనేక గంజాయి కేసుల్లో అరెస్టైంది. రెండు, మూడు సార్లు జైలుకు వెళ్లినప్పటికీ, విడుదలైన వెంటనే మళ్లీ అదే వ్యాపారంలోకి ప్రవేశించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పునరావృత నేరాలను దృష్టిలో ఉంచుకొని 2021లో శేరిలింగంపల్లి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు ఆమెపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. సాధారణంగా ఈ చట్టం తీవ్రమైన నేర కార్యకలాపాలను అరికట్టేందుకు ఉపయోగిస్తారు. అయినప్పటికీ, 2022 అక్టోబర్‌లో జైలు నుంచి విడుదలైన తర్వాత నీతూబాయ్ మరింత ప్రణాళికాబద్ధంగా తన వ్యాపారాన్ని పునఃప్రారంభించినట్లు దర్యాప్తులో తేలింది. ఈసారి నీతూబాయ్ ఒంటరిగా కాకుండా తన కుటుంబ సభ్యులందరినీ వ్యాపారంలో భాగస్వాములను చేసింది. కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. సరుకు కొనుగోలు, నిల్వ, ప్యాకింగ్, విక్రయం, నగదు వసూళ్లు, సమాచారం సేకరణ వంటి పనులను విడివిడిగా నిర్వహించే వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అక్రమ కార్యకలాపాలపై అనుమానం రాకుండా ఉండేందుకు నానక్‌రామ్‌గూడలో రెండు కిరాణా దుకాణాలను ఏర్పాటు చేసినట్లు విచారణలో బయటపడింది. ఒక దుకాణాన్ని కుమారుడు కళాపతి గౌతమ్ సింగ్ నిర్వహించగా, మరో దుకాణాన్ని మధుబాయ్ చూసుకునేది. బయటకు సాధారణ కిరాణా వ్యాపారంలా కనిపించినా, లోపల గంజాయి విక్రయాలు జరిగేవని అధికారులు గుర్తించారు. ఈ విధానం వల్ల స్థానికులకు కూడా పెద్దగా అనుమానం రాకుండా ఉండేదని తెలుస్తోంది.

**కొనుగోలు నుంచి విక్రయం వరకు పక్కా వ్యూహం** దూల్‌పేట నుంచి కిలోకు సుమారు రూ.8 వేల చొప్పున గంజాయిని కొనుగోలు చేసి రహస్యంగా నానక్‌రామ్‌గూడకు తరలించేవారని సమాచారం. ఒకేసారి 15 నుంచి 20 కిలోల వరకు సరుకు తీసుకువచ్చేవారని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. తర్వాత దానిని చిన్న చిన్న ప్యాకెట్లుగా విభజించి విక్రయించేవారు. ఈ పద్ధతి వల్ల వినియోగదారులకు సులభంగా అందుబాటులో ఉండటమే కాకుండా, లాభాలు కూడా భారీగా పెరిగేవి.వ్యాపార లెక్కలు చూస్తే ఈ నెట్‌వర్క్ ఎంత లాభదాయకంగా పనిచేసిందో అర్థమవుతుంది. కిలో గంజాయిని రూ.8 వేలకే కొనుగోలు చేసి, చిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయించడం ద్వారా సుమారు రూ.25 వేల వరకు ఆదాయం పొందేవారని అధికారులు అంచనా వేశారు. అంటే ఒక్క కిలోపై రూ.17 వేల లాభం. రోజుకు 20 కిలోల వరకు విక్రయాలు జరిగితే దాదాపు రూ.3.4 లక్షల లాభం వస్తుందని లెక్కలు చెబుతున్నాయి.

**రోజువారీ వ్యాపారం.. నెలకు కోట్లలో ఆదాయం** రోజుకు లక్షల రూపాయల లాభం వస్తుండటంతో నెలకు కోటి రూపాయల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందని గత దర్యాప్తుల్లో అధికారులు పేర్కొన్నారు. సాధారణ వ్యాపార సంస్థలు కూడా సాధించలేని స్థాయిలో నగదు ప్రవాహం ఉండటంతో ఈ నెట్‌వర్క్‌పై ప్రత్యేక నిఘా పెట్టినట్లు సమాచారం.

# పొదుపు లక్షల్లో.. ఆస్తులు కోట్లలో!

ఏసీబీ కేసు నమోదు చేసే సమయానికి ఆయన ఆదాయం రూ.3.94 కోట్లు కాగా కుటుంబ ఖర్చులు రూ.3,89,56,712గా గుర్తించారు. అంటే ఆయనకు ఇక సేవింగ్స్ మిగిలినవి రూ.4,43,288 మాత్రమే. అయితే ప్రాథమిక విచారణలో ఆయన ఆస్తులను రూ.7,90,57,617గా ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇందులో సేవింగ్స్ మినహాయిస్తే రూ.7,86,14,329 ఆస్తులు ఆయన కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. సుమారు మూడు దశాబ్దాల సర్వీసులో ఆయనకు చట్టబద్ధంగా మిగలాల్సిన పొదుపుకన్నా రూ.7.86 కోట్ల ఆస్తులు సంపాదించడంతో అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రాథమిక విచారణలో ఆయన ఆదాయానికి మించి 177 రెట్లు అక్రమార్జనకు పాల్పడినట్లు ఏసీబీ అధికారులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. మంగళవారం 15 చోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహించి దాదాపు రూ.200 కోట్లకు పైగా ఆస్తులను గుర్తించారు.

# గుజరాత్ మోడల్‌తో దూసుకు వచ్చిని మోడీ

చిన్న విషయం కానే కాదు. అందులోనూ విభిన్న రాజకీయ పరిస్థితులు, సవాళ్ల మధ్య కూడా విజయపథంలో కొనసాగాలంటే.. ఆ నేతకు ఏవో ప్రత్యేక లక్షణాలు కచ్చితంగా ఉండాలి. ఆ లక్షణాలే మోడీని సుదీర్ఘకాలం కొనసాగుతున్న ఎన్నికైన ప్రధానిగా చేసాయి. అసలు మోడీ అధికార ప్రస్థానమే చాలా వింతగా మొదలైంది. ఆ తర్వాత కూడా ప్రతి మలుపులోనూ ప్రత్యర్థుల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తూ.. మోడీ అధికారంలో కొనసాగుతూ వచ్చారు. నరేంద్ర మోడీ రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. వరుసగా ఆరు ఎన్నికల్లో అంటే మూడు సార్లు అసెంబ్లీ, మూడు సార్లు లోక్‌సభ ఎన్నికల్లో.. ఒక పార్టీని విజయ తీరాలకు చేర్చిన ఘనత కూడా ఆయనకే దక్కింది. ముఖ్యమంత్రిగా ఎక్కువకాలం పనిచేసిన అనుభవంతో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన అరుదైన నాయకుడిగా కూడా మోడీ గుర్తింపు పొందారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయాల్ని ప్రజలు చూసే కోణం కూడా మారింది. అవినీతిని, అరాచకత్వాన్ని, కుటుంబ పాలనను, పైరవీ రాజ్‌ను, బుజ్జగింపు రాజకీయాలకు.. బలమైన ప్రత్యామ్నాయం కావాలనే ఆలోచన మోడీ రేకెత్తించలిగారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు.. అభివృద్ధి రాజకీయాలకు మధ్య బ్యాలెన్స్ తీసుకు రాగలిగారు. మోడీ బ్రాండ్ మేనేజ్ మెంట్ లోనే సక్సెస్ సీక్రెట్ ఉందంటున్నారు విశ్లేషకులు. గుజరాత్ సీఎం అయినప్పట్నుంచీ ఇప్పటిదాకా.. ప్రతి ఐదేళ్లకు మోడీ తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటున్నారు. గుజరాత్ సీఎం అయ్యేనాటికి మోడీకి అసలు ఇమేజే లేదు. ఆయన కేవలం ఆరెస్సెస్ ప్రచారక్ మాత్రమే. కానీ 2002లో హిందూ హృదయ సామ్రాట్ అయ్యారు. దీంతో ఆరెస్సెస్ ప్రచారక్ అనే స్థాయి దాటేసి.. చాలా పెద్ద హిందుత్వ వాదిగా అవతరించారు. మళ్లీ 2007 వచ్చేసరికి మోడీ గుజరాత్ ను అభివృద్ధి చేసిన సమర్థ పాలకుడిగా బ్రాండ్ సృష్టించారు. ఈ బ్రాండే మరింత పెరిగి గుజరాత్ మోడల్ గా దేశమంతా ప్రచారమైంది. ఈ గుజరాత్ మోడల్ ప్రభావం ఎంతగా ఉందంటే.. అభివృద్ధికి గుజరాత్ ను పర్యాయపదంగా మార్చిన మోడీ ప్రధాని అయితే.. దేశం కూడా కచ్చితంగా మారుతుందని మెజార్టీ ప్రజలు నమ్మారు. అదే మోడీ 2019 ఎన్నికల నాటికి.. దేశాన్ని గర్వపడేలా చేసిన నేతగా రూపాంతరం చెందారు. తర్వాత 2024 ఎన్నికల సమయంలో రాముడ్ని అయోధ్యకు తెచ్చిన నేతగా బ్రాండ్ సృష్టించుకున్నారు. ఇలా ప్రతి దశలోనూ విపక్షం పోటీ ఇవ్వలేని స్థాయిలో బ్రాండ్ బిల్డింగ్ చేసుకుంటూ విజయప్రస్థానం కొనసాగిస్తున్నారు మోడీ. రాజకీయ అవసరాలకు తగ్గట్టుగా మోడీ సరికొత్త బ్రాండ్ ఇమేజ్ ను సృష్టించుకుంటూ వచ్చారు. హిందూ హృదయ సామ్రాట్ అనేది గుజరాత్ వరకు సరిపోయింది. దేశ రాజకీయాలపై ఫోకస్ పెట్టగానే.. దేశాన్ని మార్చగల నేతగా అవతరించారు. క్రమంగా వికాస్ పురుష్ గా, విశ్వగురువుగా తనను తాను ప్రొజెక్ట్ చేసుకున్నారు. ఈ దృక్పథం కార్పొరేట్లను కూడా మెప్పించింది. సుస్థిర సమగ్ర అభివృద్ధి, పెట్టుబడులకు రెడ్ కార్పెట్, అవినీతికి చెక్ లాంటివి అందరికీ నచ్చాయి. అసలు మోడీ రాజకీయం చేసే తీరే చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఒక్కసారి అనుకున్నారంటే.. ఆరు నూరైనా ఆ పనైందాకా నిద్రపోరు మోడీ. అలాగే మోడీ పొలిటికల్ డిక్షనరీలో అసాధ్యం అనే పదానికి చోటులేదు. ఎంత కష్టమైనా పడి అనుకున్నది సాధించాలనే తపనతో పనిచేస్తారు. మోడీ రాజకీయ జీవితంలో ఎన్నోసార్లు సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారు. సాధారణ రాజకీయ నేతలు సంకోచించే నిర్ణయాలను కూడా ఆయన అలవోకగా తీసుకుంటారు. ఆ లక్షణాన్ని తన బలంగా చెప్పుకుంటారు మోడీ. దేశంలో బీజేపీ సొంతంగా అధికారంలోకి వస్తుందనే విషయం కూడా ఎవ్వరి ఊహకూ అందని విషయం. దాన్ని ఒక్కసారి కాదు.. ఏకంగా రెండుసార్లు సాధ్యం చేశారు మోడీ. అంతేకాదు వరుసగా మూడోసారి కూడా మిత్రుల మద్దతుతో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చారు. ఇలా తన పనైపోయిందని ప్రత్యర్థులు భావించిన ప్రతిసారీ.. దిమ్మతిరిగే జవాబిచ్చిన ట్రాక్ రికార్డు ఆయనకు ఉంది. బలహీనతల్ని కూడా క్రమంగా బలాలుగా మార్చుకోవడం ఎలాగో మోడీ స్వీయ అనుభవంతో నేర్చుకున్నారు. అందుకోసం సరికొత్త వ్యూహాల అమలుకు, వినూత్న ఆలోచనలు చేయటానికి ఆయన ఎప్పుడూ వెనుకాడరని సహచరులు చెబుతుంటారు. 2024 లోక్‌సభ ఎన్నికల్ని ప్రామాణికంగా తీసుకుంటే.. ఆ ఎన్నికల్లో మిత్రులతో కలిసి మోడీ విజయం సాధించారు. హ్యాట్రిక్ పీఎం అనే ట్యాగ్ వచ్చినా.. ఆయన ఎక్కడా రెస్ట్ తీసుకోలేదు. ఆ ఎన్నికల తర్వాత కొన్ని నెలల వ్యవధిలో వచ్చిన మహారాష్ట్ర, హరియాణా ఎన్నికలకు ముందు నుంచే వ్యూహరచన చేశారు. ఎన్నికలు రాగానే ఆ వ్యూహాన్ని పక్కాగా అమలు చేసి.. అనుకున్న ఫలితం సాధించారు. అక్కడితో ఆగితే ఆయన మోడీ ఎందుకవుతారు. అసలు ఎన్ని విజయాలు సాధించినా తృప్తి పడటం మోడీకి ఇష్టం ఉండదు. రాజకీయ నేతగా ఒక్క గెలుపుతోనో.. కొన్ని విజయాలతోనే సంతృప్తి చెందితే.. ఇక భవిష్యత్తు ఉండదనేది ఆయనకు ఆయనగా పెట్టుకున్న రాజకీయ సూత్రం. దేశంలోనే అత్యంత విజయవంతమైన నేతగా ఉన్నా కూడా మోడీ తాను పెట్టుకున్న సూత్రాల విషయంలో రాజీ పడరు. ఓవైపు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటూనే.. మరోవైపు వ్యక్తిగతంగా తన రాజకీయ సూత్రాల్ని కూడా మేళవించి ఎన్నికల్లో ప్రయోగించటం మోడీకి అలవాటు.

# మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై

## సుప్రీంకోర్టుకు కాంగ్రెస్

తెలంగాణలో తనపై నమోదైన కేసు వివరాలను నామినేషన్ అఫిడవిట్‌లో వెల్లడించలేదన్న బీజేపీ అభ్యంతరం ఆధారంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. అయితే ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసు నమోదు కాలేదని, కేవలం కోర్టు నోటీసు మాత్రమే జారీ అయిందని కాంగ్రెస్ వాదిస్తోంది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ఎంపీలు కే.సి. వేణుగోపాల్, జైరాం రమేష్, రణ్‌దీప్ సుర్జేవాలా సహా పలువురు నేతలు ఎన్నికల సంఘాన్ని కలిసి తమ వాదన వినిపించారు. మీనాక్షి నటరాజన్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఎన్నికల సంఘానికి అందించామని కాంగ్రెస్ నేతలు తెలిపారు.సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ మాట్లాడుతూ మీనాక్షి నటరాజన్‌పై క్రిమినల్ కేసు ఉన్నట్లు చెప్పడం సమంజసం కాదన్నారు. సంబంధిత కోర్టు ఇప్పటివరకు కేసును స్వీకరించలేదన్నారు. అది వెల్లడించాల్సిన కేసుల పరిధిలోకి రాదని వివరించారు. మరోవైపు పౌరహక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాద్ కూడా రిటర్నింగ్ అధికారి నిర్ణయాన్ని తప్పుబట్టారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం కోర్టు అభియోగాలు నమోదు చేసిన తర్వాత మాత్రమే ఆ వివరాలను వెల్లడించాల్సిన అవసరం ఉంటుందని పేర్కొన్నారు.

నామినేషన్‌ను తిరస్కరించడం చట్ట విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ఈ వివాదం కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలను కూడా బయటపెట్టిందనే చర్చ జరుగుతోంది. తెలంగాణ నుంచి వచ్చిన సమాచారమే ఈ వివాదానికి కారణమైందని మధ్యప్రదేశ్ మంత్రి కైలాష్ విజయవర్గీయ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నాయకులే ఈ సమాచారాన్ని బయటకు ఇచ్చి ఉండొచ్చని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం ఈ అంశంపై సుప్రీంకోర్టు నిర్ణయం, ఎన్నికల సంఘం తుది నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# విజ్ఞాన సిరులు... ప్రభుత్వ బడులు






## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండి పరిమళ జ్యోతి.

**కాశినాయన, జూన్ 10:(నంది పత్రిక ):** విద్యార్థులు ప్రభుత్వ బడిలో చేరి విజ్ఞానవంతులై ఉత్తమ పౌరులుగా రాణించాలని( ఎం ఈ ఓ ) నిర్మల పిలుపునిచ్చారు. బుధవారం రెడ్డి కొట్టాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో బుధవారం నాడు బడి పండుగ ప్రచార కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో (హెచ్ ఎమ్ )చంద్రశేఖర్, పిఎస్ హెచ్ఎం ఖదీర్ భాష, పాఠశాల చైర్మన్ జల్లి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరిమళ జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యనందిస్తున్నామన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వం విద్యార్థుల కోసం కల్పిస్తున్న రకరకాల సంక్షేమ పథకాలను, కొత్తగా ప్రవేశపెట్టిన ఆధునిక వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించారు. బడి పండుగ నినాదాలతో ప్రభుత్వ బడి గొప్పతనం గురించి తెలిపే పాటలతో రెడ్డి కొట్టాల గ్రామం లోని వీధులన్నీ మారు మ్రోగాయి. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారికి నాణ్యమైన విద్యను అందించే బాధ్యత తమదేనని ,వారు విద్యలో ఉన్నత శిఖరాలు అధిరోహించే బాధ్యత తమదేనని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు.ప్రైవేట్ పాఠశాలల్లో చేరి డబ్బు వృధా చేసుకోవద్దని సూచించారు.

ఈ బడి పండుగ ఈ ర్యాలీ గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ బడి పండగ ప్రచార కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదా పీర్, ఉపాధ్యాయులు ,గ్రామస్తులు ,తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బడి వైపు ప్రగతి వైపు





**నంది పత్రిక :** బడిలో ఉండాల్సిన బాలలు పనుల్లో ఉండొద్దు ఆటపాటల వయసులో పిల్లల హక్కులను హరించ వద్దు చిరునవ్వులు చిందించే పెదవులపైచింతలనిప్పులుపోయద్దుఆటపాటలతో సాగాల్సిన బాల్యాన్ని అంగట్లో సరుకుగా మార్చవద్దు బడికి వెళ్ళే భాగ్యం లేక బతుకు భారమై సాగుతున్నబాలల బాల్యాన్నిచీకటి గుహగామార్చద్దుపుస్తకాలు పుట్టాల్సినచేతులకు సుత్తెలు కొడవళ్ళు గడ్డపారలు ఇవ్వద్దు.పశువుల కాపరిగా మార్చద్దు. బడిబాట పట్టాల్సిన పాదాలను బండ చాకిరి వైపు నడిపించ వద్దు.ఇటుక బట్టీల సెగల మధ్యకరిగిపోతన్న బాల్యాన్ని బడినీడలో రక్షించాలి.హోటల్లో ప్లేట్లుకడిగిశ్రమదోపిడీకినలిగిపోతున్నరేపటి తరానికి ఆశా వహ జీవితాన్ని ఇవ్వాలి.బాలల కలల రెక్కలను తెంచవద్దు వారి ఊహలను చిదిమేయ వద్దురసాయనాల ఫ్యాక్టరీ పొగల్లో ఊపిరి ఆడని బాల్యం ఆకలి కేకలతోఎక్కువ పనిగంటలు పనిచేస్తూ కంపెనీల్లో బూడిద పాలవుతున్న అనారోగ్య బాల భారతంపొగచూరిన ఫ్యాక్టరీలగోడలమధ్యపసిప్రాణాలనుబలిపెట్ట వద్దు.బాణ సంచా మందు గుండుతయారీ వెనుక వారి పచ్చని బతుకులను కాల్చవద్దు.అమ్మ ఒడిలో పెరగాల్సినచిన్నారులు ఆనాదాల్లాశ్రమిస్తుంటే చూడవద్దు.అక్షరాల వెలుగులుచూడాల్సిన కళ్ళను కన్నీటి సముద్రంలో ముంచకండి బాల్యం అనేది దేవుడి ఇచ్చిన వరం దానిని తుంచడం నేరం చదువే బాలలకు ఆయుధం అదే దేశానికి శ్రీరామరక్ష బాల కార్మికుల శ్రమ దోపిడీకి చరమగీతం పాడుతాం.బాల కార్మిక నిర్మూలన చట్టాలపై అవగాహన చైతన్యం పెంచుకుందాం బాలకార్మిక రహిత సమాజాన్ని నిర్మిద్దాం ప్రతి బిడ్డకుచదువులవెలుగులిద్దాం.బాలలు బడి వైపుసమాజం ప్రగతి వైపువెళ్ళేసామాజికవాతావరణంసృష్టిద్ధ.బాలలు రేపటి పౌరులుకాదునేటి పౌరులే అన్న స్పృహతో బాలల సర్వతో ముఖాభివృద్ధికి ప్రభుత్వం పౌరసమాజంఉపక్రమించాలి.నేదునూరి కనకయ్య అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం (బాలకార్మిక వ్యవస్థ పై పరిశోధకులు)మాజీ ఎన్ ఎస్ ఎస్ అధికారి కరీంనగర్(జూన్12 ప్రపంచ బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా)

# ఆదోనిలో ప్రధానమంత్రి కోసం ప్రత్యేక పూజలు...






## ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి

**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** భారతదేశ స్వాతంత్ర్యానంతరం భారతదేశానికి ప్రధానమంత్రులుగా పనిచేసిన వారందరి కంటే ఎక్కువ కాలం ప్రధానమంత్రిగా పనిచేసిన గుర్తింపు మన ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారికి దక్కిందని ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి గారు తెలిపారు.నరేంద్రమోడి గారు ప్రధానమంత్రి 12సంవత్సరాలు పూర్తిచేసుకుని 13 సంవత్సరములోకి అడుగుపెడుతున్న సందర్భంగా మోడీ గారికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఇంకా సాధ్యమైనంత ఎక్కువ కాలం ప్రధానమంత్రిగా కొనసాగుతూ భారతదేశములోని పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి సాధిస్తూ ప్రపంచ దేశాలన్నింటికంటే ఆర్థిక, సామాజిక రాజకీయ వ్యవసాయ వ్యాపార,సైనిక అంతరిక్ష రంగాలలో తిరుగులేని శక్తిగా నిలిపేందుకు నరేంద్ర మోడీ గారికి శక్తిని ప్రసాదించాలని అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పివిన్ మాధవ్ గారికి కూడా రాష్ట్రములో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసే శక్తిని మరియు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుతూ ఈరోజు ఆదోని పట్టణములోని శ్రీశ్రీ మంగరాయ ఆంజనేయ స్వామి దేవస్థానము లో ప్రత్యేక పూజలు నిర్వహించామని ఎమ్మెల్యే పార్థసారథి గారు వివరించారు.ముందుగా ఎమ్మెల్యే పార్థసారథి గారు దేవస్థానము వద్దకు చేరుకోగానే దేవస్థానము విచారణ కర్త నఖాతే శ్యాం ప్రసాద్, ఆదోని బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నఖాతే శ్రీధర్, ఆలయం మేనేజర్ భీమాచార్ ఆలయ ప్రధానార్చకులు గురాచార్ మరియు వేద పండితులు నెరణికి దత్తాత్రేయ శాస్త్రి, గరుడాద్రి రమేష్, వేణుగోపాల్ శర్మ, గరుడాద్రి కార్తీక్ శర్మ మొదలైన బ్రాహ్మణులు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు..ఈ కార్యక్రమములో

బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు గునిగిరి నీలకంఠ, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర నియోజకవర్గ కో కన్వీనర్ నాగరాజు గౌడ్,వెల్లాల మధుసూధనశర్మ, బిజెపి మండలాల అధ్యక్షులు వేణుగోపాల్,ఉషారాజు మహబూబ్ బాషా,బు నాగార్జున,

దేశాయ్ గిరి, దేశాయ్ రవీంద్ర, దేశాయ్ చక్రవర్తి, నాగేష్, దుర్గాప్రసాద్,పెద్ద ఎత్తున భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు....

# అత్యవసరపు సేవలలో 108 సిబ్బంది సేవలు శభాష్ అంటున్న ప్రజలు

**నంది పత్రిక ఆత్మకూరు మండలం** ఆత్మకూరు మండలం రుద్ర కోడూరు గూడెం గ్రామానికి చెందిన నాగమ్మ అనే మహిళ ప్రసావ వేదనతో బాధపడుతు ఉంటే అత్యవసర సమయంలో మన ఆప్తులు 108 అంబులెన్స్ సిబ్బంది ఉన్నారు కదా అని గుర్తించి 108 కు ఫోన్ చేసింది. ఫోన్ చేసిన వెంటనే 20 నిమిషాల లోపల సిబ్బంది వచ్చి అంబులెన్స్ లో ఎక్కించుకొని నాగమ్మకు కాన్పు చేశారు. నాగమ్మ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు. తల్లి బిడ్డను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.108 సిబ్బంది పట్ల రుద్రకోడూరు గూడెం ప్రజలు సంతోషంతో మీరు మా దేవుళ్ళు అని పొగిడారు. సిబ్బంది: ఎమర్జెన్సీ టెక్నీషియన్ రజనీకాంత్ మరియు పైలెట్ సంజీవకర్ణ



# శ్రీ శాంతి నికేతన్ స్కూల్‌లో సీబీఎస్ఈ ఎలైట్ బ్లాక్ ప్రారంభం







## విద్యార్థులకు ఆధునిక విద్యా సౌకర్యాల కల్పనకు మరో ముందడుగు

**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 10 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని శ్రీ శాంతి నికేతన్ స్కూల్‌లో నూతనంగా నిర్మించిన సీబీఎస్ఈ ఎలైట్ బ్లాక్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ చైర్మన్ సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై ఎలైట్ బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎండీ ఫిరోజ్ ప్రముఖ న్యాయవాది తాతిరెడ్డి తులసి రెడ్డి , రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణ రెడ్డి , క్రాంతినగర్ టీడీపీ నాయకుడు శ్రీనివాసులు , కాపు సంఘ నాయకుడు మిలటరీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అతిథులు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక వసతులు అందించడంలో శ్రీ శాంతి నికేతన్ స్కూల్ యాజమాన్యం చేస్తున్న కృషిని అభినందించారు. నూతనంగా ఏర్పాటు చేసిన సీబీఎస్ఈ ఎలైట్ బ్లాక్ విద్యార్థుల ప్రతిభను

మరింత మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.







# ఘనంగా నందమూరి బాలకృష్ణ గారి జన్మదిన వేడుకలు



**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 10 ( నంది పత్రిక )** నంద్యాల నియోజకవర్గం లో మంత్రి వర్యులు చీ.వీస ఫరూక్ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీ.వీస.ఫిరోజ్ ఆద్వర్యంలో సినీ నటుడు హిందూపురం శాసన సభ్యుడు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఫిరోజ్ గారు మాట్లాడుతూ నిండు నూరేళ్ళు సుఖ సంతోషాలు ఆయువు ఆరోగ్యాలు అష్ట ఐశ్వర్యాలు ఆ దేవుడు మీకు ప్రసాదించాలి అని రాబోయే రోజుల్లో రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు అనుభవించాలి అని ఆ దేవుడిని మనసారా కోరుకుంటున్నాము అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు మనియర్ ఖలీల్, ఖండే శ్యామ్ సుందర్ లాల్ ,గోవింద్ నాయుడు ,బేడా బుడగజంగాల రాష్ట్ర అధికార ప్రతినిధి, నంద్యాల టౌన్ 38వ వార్డు టీడీపీ ఇంచార్జ్ తాటికొండ బుగ్గరాముడు ,కృపాకర్,జోసెఫ్,నాగార్జున, శ్రీకాంత్ నాయుడు, సాయిరాం రాయల్,మున్నా,అఫ్జల్, జాకీర్,శ్రీ హరి, మరాఠీ సూరి,పట్టణ మహిళా అధ్యక్షురాలు విజయ గౌరి, పద్మావతి,సౌభాగ్యవతి,రత్నమ్మ, భారతి,దీపక్ రెడ్డి,జయ ప్రకాష్,శ్రీ దేవి,మల్లెల భాస్కర్, హోరన్ భేగ్, తదితర టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## పశువైద్యాధికారులకు వీడ్కోలు స్వాగత కార్యక్రమం

భువనగిరి జిల్లా పశువైద్య కార్యాలయంలో బదిలీపై వెళ్ళిన పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులకు, పశు వైద్యాధి కారులకు నూతనంగా జిల్లాకు వచ్చిన పశు వైద్యాధికారులకు ఆత్మీయ వీడ్కోలు, స్వాగత కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా టీజేఏసీ చైర్మన్, టీజీవో అసోసియేట్ ప్రెసిడెంట్ మందడి ఉపేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బదిలీపై వెళ్ళిన పశు వైద్యులను, నూతనంగా వచ్చిన వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కటకం రమేష్, పశువైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ పుడోట శ్రీకాంత్, సహాయ సంచాలకులు డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ శ్రీనాథ్, జిల్లా సెక్రటరీ డాక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

నంది పత్రిక
గురువారం 11 - 06 -2026

# పశుసంవర్ధక శాఖలో కీచక పర్వం ..

**ఉదయగిరి జూన్ 10నంది పత్రిక** : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వింజమూరు మండలం చాకల కొండ పశువైద్యాధికారి డా. కొమ్మి కోటేశ్వరరావు వ్యవహార శైలిపై క్రింది స్థాయి సిబ్బంది మనోవేదన.. నెల తరబడి డ్యూటీ చేసి ఒకటో జీతం తీసుకోవాలి అంటే లంచం ఇవ్వనిదే డ్యూటీ సర్టిఫికెట్, లీఫ్ సాంక్షన్ లేదు.తాను అడిగింది సమకూర్చక పోతే వేదింపులు. పనిగట్టుకొని మరి వారిపై కక్ష సాధింపులు.. తన కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న ప్రైవేటు మెడికల్ షాపుకు రైతుల ద్వారా నెలవారి కొనుగోలు టార్గెట్.ధిక్కరిస్తే తప్పుడు స్టేట్మెంట్ క్రింది స్థాయి సిబ్బంది పై ఉన్నతాదికారులకు తప్పుడు ఫిర్యాదు,పత్రికల ద్వారా వార్త కథనం,తీరా ప్రజలను ఆరా తీయగా మేము సదరు ఏ హెచ్ ఏ బూక్కాపురం పై మేము సదరు డాక్టర్ కి గాని ఉన్నతాధికారులకు గాని ఫిర్యాదు చేయలేదని డా.కొమ్మి కోటేశ్వరరావు సబ్సిడీ ద్వారా జొన్నలు,పశువులకు ఫీడింగ్ ఇప్పిస్తాను అని సంతకాలు సేకరించారు అని స్పష్టీకరణ.

సదరు క్రింది స్థాయి సిబ్బంది పై వేధింపులకు పాల్పడిన డా. కొమ్మి కోటేశ్వరరావు పై ఇటీవల ఉన్నత అధికారులు విచారణ చేసినట్లు సమాచారం సమాచారం .

# ఉమ్మడి జిల్లాల క్రికెట్ విజేతలకు బహుమతులు



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండల కేంద్రమైన కొత్తపల్లిలో రఘు రాముడు జ్ఞాపకార్థం నిర్వహించిన ఉమ్మడి జిల్లాల క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేసినట్లు మొదటి బహుమతి దాత తలకంటి నరసింహారెడ్డి నిర్వాహకులు రవి తెలిపారు. బుధవారం ఉమ్మడి జిల్లాల పోటీల్లో మొదటి విజేత అయిన గడివేముల జట్టు, రెండవ విజేత అయిన కొత్తపల్లి జట్లకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కీర్తిశేషులు రఘురాముడు జ్ఞాపకార్థం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లాల క్రికెట్ పోటీలు గత వారం రోజుల నుంచి నిర్వహించడం జరిగిందన్నారు. ఈ క్రీడా పోటీలకు సుమారు 34 జట్లు పాల్గొన్నాయి అన్నారు. అయితే కొత్తపల్లి గడివేముల జట్లు తలపడగా మొదటి విజేత గడివేముల జట్టు కైవసం చేసుకుంది. గడివేముల జట్టుకు 30 వేల రూపాయలు మొదటి బహుమతి రెండో బహుమతి కొత్తపల్లి జట్టుకు 15 వేల రూపాయలు అందజేయడం జరిగిందన్నారు.

# అత్యధిక రోజులు భారత ప్రధానిగా సేవలందించిన నరేంద్ర మోదీ.



**బేతంచెర్ల జూన్ 10 ( నందిపత్రిక ).** నరేంద్ర మోదీ భారతదేశ ప్రధానిగా సుదీర్ఘకాలం (4399 రోజులు) అత్యధిక రోజులు భారతదేశ ప్రధానిగా సేవలందించిన సందర్భంగా, నరేంద్ర దామోదర్ దాస్ మోదీ, పేరు మీద పూజలు, అర్చనలు చేసిఆయనకు మంచి ఆరోగ్యం భగవంతుని కృప కరుణాకటాక్షాలు కలగాలని, దేశ సేవలో మరికొన్ని నూతన అధ్యాయాలు లిఖించాలని బేతంచెర్ల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పూజలు చేసి భగవంతుడిని బుధవారం నాడు ప్రార్థించారు. అధిక సంఖ్యలో బిజెపి నాయకులు నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గోరుమానకొండ ఏపీ మోడల్ స్కూల్‌లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానం.



**బేతంచెర్ల జూన్ 10 ( నందిపత్రిక ).** రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు, 2026-27 విద్యా సంవత్సరానికి, ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్‌లో, మిగిలి ఉన్న 6వ తరగతి,7వ తరగతి,8వ తరగతి,9వ తరగతి మరియు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం, అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్థూ నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగింది.దరఖాస్తుల స్వీకరణ 10-06-2026 నుండి 20-06-2026 వరకు జరుగుతుంది. 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు మరియు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం కొరకు ప్రవేశాలు కోరడమైనది. 24-06-2026న ప్రవేశ పరీక్ష నిర్వహింబడుతుంది. ఎంపికైన అభ్యర్థుల జాబితా 25-06-2026న ప్రకటింప బడుతుంది. సర్టిఫికేట్ పరిశీలన మరియు ప్రవేశాలు 26-06-2026న నిర్వహించ బడతాయి.విద్యార్థులు తప్పనిసరిగా, మీసేవ లేదా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.ఆఫ్లైన్ దరఖాస్తులు స్వీకరించబడవు. మిగిలిన ఖాళీలను స్థానిక మరియు స్థానికేతర అభ్యర్థుల నుండి నిబంధనల ప్రకారం భర్తీ చేయబడును.అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ టి.మరియ దాస్ తెలియజేశారు.

# యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు..



**చాగలమర్రి జూన్ 10 నంది పత్రిక** ఇటీవల వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మురుగు కాలువలు నిండి రోడ్లపై ప్రవహిస్తుండడం గమనించిన పంచాయతీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన మురుగు కాలువలలోని చెత్త తీసివేయుటకు పారిశుద్ధ్య కార్మికులకు ఆదేశాలు ఇచ్చారు. బుధవారం కాలువలలో పేరుకుపోయిన చెత్త చెదారమంతా తీసి ట్రాక్టర్ ద్వారా తరలించడం జరుగుతుంది.

# నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం పరిరక్షణకు రైతుల పోరాటానికి సంపూర్ణ మద్దతు

## నూనెపల్లె మార్కెట్ యార్డు భూమిని తెలుగుదేశం పార్టీకి కేటాయించిన ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

## రాయలసీమ సాగునీటి సాధన సమితి



**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 10 ( నంది పత్రిక )** నూనెపల్లె మార్కెట్ యార్డులోని రెండు ఎకరాల భూమిని తెలుగుదేశం పార్టీకి దారాదత్తం చేస్తూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా భారతీయ కిసాన్ సంఘ్ బుధవారం చేపట్టిన నిరసన కార్యక్రమానికి రాయలసీమ సాగునీటి సాధన సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు సహదేవరెడ్డి ఆద్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు యర్రం శంకర్ రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, సంఘ్ నాయకులు సిద్దారెడ్డి, మహేశ్వరరెడ్డి, నందిరైతు సమాఖ్య నాయకులు కృష్ణారెడ్డి మరియు రైతు ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు మాట్లాడుతూ..**

గత ప్రభుత్వ తిరోగమన నిర్ణయాల ఫలితంగా నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ పరిశోధన స్థానం పరిధిలోని 50 ఎకరాల భూమిని ప్రభుత్వ వైద్య కళాశాలకు కేటాయించడం, అదేవిధంగా అక్కడే తాత్కాలిక కలెక్టరేట్‌ను ఏర్పాటు చేయడం వల్ల రాయలసీమ రైతాంగానికే కాకుండా దేశవ్యాప్తంగా రైతులకు అవసరమైన పంటల విత్తనాల అభివృద్ధి, పరిశోధన కార్యక్రమాలకు కేంద్రబిందువుగా ఉన్న ఈ సంస్థ నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 125 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ప్రతిష్ఠాత్మక పరిశోధన సంస్థను బలహీనపరుస్తున్న చర్యలను అప్పట్లో తెలుగుదేశం పార్టీతో సహా దాదాపు అన్ని రాజకీయ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి.. నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానాన్ని పరిరక్షించాలని బహిరంగంగా డిమాండ్ చేశాయని గుర్తు చేసారు. అయితే, 50 ఎకరాల భూమి ఇప్పటికే వైద్య కళాశాలకు కేటాయించబడిన నేపథ్యంలో, ప్రస్తుతం ఈ పరిశోధన సంస్థను కాపాడుకునేందుకు మిగిలిన అత్యంత కీలకమైన అవకాశం అక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక కలెక్టరేట్‌ను తక్షణమే ప్రత్యామ్నాయ స్థలానికి తరలించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఈ అంశాన్ని తెలుగుదేశం పార్టీ నాయకత్వం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లగా, కలెక్టరేట్‌ను మార్కెట్ యార్డుకు గానీ లేదా ఇతర అనువైన ప్రదేశానికి గానీ తరలించి పరిశోధన స్థానాన్ని పరిరక్షిస్తామని వారు హామీ ఇచ్చారని తెలిపారు.కానీ, నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం పరిరక్షణ అనే అత్యవసర అంశాన్ని పక్కనపెట్టి, కూటమి ప్రభుత్వం నూనెపల్లె మార్కెట్ యార్డులోని రెండు ఎకరాల భూమిని 33 సంవత్సరాల కాలానికి సంవత్సరానికి కేవలం ₹1,000 లీజు చొప్పున తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం కేటాయించడం అత్యంత విచారకరం. రైతుల భవిష్యత్తు, వ్యవసాయ పరిశోధనల పరిరక్షణ కంటే పార్టీ కార్యాలయ నిర్మాణానికే ప్రాధాన్యత ఇవ్వడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమైన చర్యగా మేము భావిస్తున్నామన్నారు. ఈ నిర్ణయాన్ని రాయలసీమ సాగునీటి సాధన సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం పరిరక్షణ, రైతుల ప్రయోజనాల సాధన, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం భారతీయ కిసాన్ సంఘం చేపట్టిన ఉద్యమానికి మా సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తూ ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందన్నారు. అందువల్ల, రైతు హక్కులు, వ్యవసాయ పరిశోధనల పరిరక్షణ మరియు ప్రజా ప్రయోజనాల కోసం మార్కెట్ యార్డు స్థలాన్ని, అలాగే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థలాన్ని పరిరక్షించాలని ఈ సందర్భంగా నంద్యాల జిల్లా సంయుక్త కలెక్టర్ భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సహదేవరెడ్డి ఆద్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. రైతు సంఘాలు ఇచ్చిన వినతిపత్రాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెల్తామని హామీ ఇచ్చారు.

# ఆళ్లగడ్డను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే అఖిలమ్మ ఆశయం :

## స్టేట్ డైరెక్టర్ కాటంరెడ్డి.



**శిరివెళ్ల :(నంది పత్రిక)** ఆళ్లగడ్డ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే శాసనసభ్యురాలు భూమా అఖిలప్రియ గారి ఆశయమని ఆంధ్రప్రదేశ్ కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో క్లస్టర్ ఇన్చార్జి యామ గుర్రప్ప అధ్యక్షతన బుధవారం నిర్వహించిన తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తల సమావేశంలో కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా శిరివెళ్ల మండలంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి చర్చించారు.ఈ సందర్భంగా కాటంరెడ్డి మాట్లాడుతూ, గత రెండేళ్ల కాలంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఆల్లగడ్డ నియోజకవర్గంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారి ఆదేశాల మేరకు గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సమగ్రంగా వివరించారు. తాగునీటి సమస్యల పరిష్కారం, రహదారుల అభివృద్ధి, విద్యా మరియు వైద్య రంగాల బలోపేతం, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, రైతు సంక్షేమం, మహిళా సాధికారత వంటి అనేక రంగాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని యామ గుర్రప్ప పేర్కొన్నారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన అందిస్తూ, అభివృద్ధి మరియు సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని యూనిట్ ఇన్చార్జి సూర రామ తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి అల్లగడ్డ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు కృషి పట్టుదలతో ఉన్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టిడిపి ఉపాధ్యక్షురాలు కల్లూరి శకుంతలమ్మ శేష ఓబులరెడ్డి నీటి సంఘం వైస్ చైర్మన్ చింతకుంట్ల బూసిరెడ్డి,కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కొలతల ప్రకారం పని చేసుకోండి

## ఏపీడి సాంబశివరావు



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 10 :** ఉపాధి హామీ కూలీలు తమకు ఇచ్చిన కొలతల ప్రకారం పని చేసుకోవాలని అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ సాంబశివరావు సూచించారు. బుధవారం బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న కడమల కాల్వ, వెంగల్ రెడ్డి పేట గ్రామపంచాయతీ లలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీ డి తో పాటు అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ వసుధారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి ఉపాధి కూలీలతో ఏపీ డి సాంబశివరావు మాట్లాడారు. ఉపాధి కూలీలకు ఇచ్చిన కొలతల ప్రకారం పని చేసుకుంటే 307 రూపాయలు కూలీ పడుతుందని అని చెప్పారు. ఉపాధి కూలీలకు సక్రమంగా వేతనాలు అందుతున్నాయా లేదా అన్న విషయాలను గురించి అక్కడి మహిళలను అడిగి తెలుసుకున్నారు. కూలీలు మొదట పనికి వచ్చినప్పుడు మొదటి ఫోటో, తర్వాత రెండవ ఫోటో ఏ ఏ సమయానికి వస్తుందన్న విషయాన్ని కూడా ఈపిడి అడిగి తెలుసుకున్నారు. మస్టర్ గురించి కూలీలకు అవగాహన ఉండాలని అన్నారు. మస్టర్ ను ఎవరైనా ఎప్పుడైనా తనిఖీ చేసుకోవచ్చు అని అన్నారు. కూలీలు పనిచేసినప్పుడు మస్టర్ లో తమ హాజరు శాతాన్ని గురించి కూడా పరిశీలించుకోవాలని అన్నారు. పడమర కాల్వ శివ నందీశ్వర స్వామి కోనేరు వద్ద పూడిక తీత పనులు చేసేందుకు గాను మంజూరు లభించింది అని అన్నారు. తర్వాత బండి ఆత్మకూరు గ్రామంలోని ఆదర్శ పాఠశాల నందు అనంత అరణ్య ( అల్ట్రా హైడెన్సిటీ ప్లాంటేషన్ ) పనిని కూడా ఏపిడి పరిశీలించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆదర్శ పాఠశాలలో అనంత ఆరోగ్య సంకల్పం 2026 ద్వారా అనంత అరణ్య ప్లాంటేషన్ ఏర్పాటు చేసేందుకు గాను ఇంకుడు గుంతల కార్యక్రమానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ ప్రాంతంలో ఇంకుడు గుంతలను ఆయన పరిశీలించారు. అనంతరం మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.



# 25 లక్షల వ్యయంతో సిసి రోడ్ పనులను ప్రారంభించిన ఎంఎల్ఎ కోట్ల.



**బేతంచెర్ల జూన్ 10 ( నంది పత్రిక.** బేతంచర్ల మండలం కోలుములపల్లె గ్రామంలో 25 లక్షలరూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు మరియు కాలువలను, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి బుధవారం ఘనంగా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా డోన్ ఎంఎల్ఎ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, తాగునీరు,పారిశుద్ధ్య సదుపాయాలు మరియు ఇతర అవసరమైన వసతులను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. డోన్ నియోజక వర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గ్రామాల్లో రహదారి సదుపాయాలు మెరుగు పడటం వల్ల ప్రజల రాక పోకలు సులభతరం కావడంతో పాటు, గ్రామాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని చెప్పారు.ప్రజల ఆశీర్వాదాలతో నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే కోట్ల తెలిపారు.గ్రామంలో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణ పనులు పూర్తి కావడంతో గ్రామస్థులు ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బేతంచెర్ల మండల స్థాయి అధికారులు,టిడిపి మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# ఆర్తి విద్యా వికాస కేంద్రాలు ప్రత్యేక కార్యక్రమాన్ని పేరుతో నిర్వహించడం అభినందనీయం

### చెరుకూరి లక్ష్మి కళ్యాణి చిన్నారులవేసవి శిబిరం ముగింపు

**వై ఎస్ ఆర్ కడప,బ్యూరో చీఫ్ జూన్ 10:నంది పత్రిక** చిన్నారుల వేసవి సెలవులను ప్రయోజనకరంగా వినియోగించుకొనేలా ఆర్తి ఫర్ గర్ల్స్ సంస్థ "ఆర్తి విద్యా వికాస కేంద్రాలు" పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి గారి సతీమణి చెరుకూరి లక్ష్మీ కళ్యాణి పేర్కొన్నారు...కడప నగరంలోని వెనుకబడిన ప్రాంతాలకు చెందిన చిన్నారులను సాధికారత దిశగా ప్రోత్సహించేందుకు ఆర్తి ఫర్ గర్ల్స్ సంస్థ "ఆర్తి విద్యా వికాస కేంద్రాలు" పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా 2026 మే 1 నుండి జూన్ 10 వరకు 40 రోజుల పాటు ఆర్తి విలేజ్ ప్రాంగణంలో వేసవి శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ శిబిరం ద్వారా వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 400 మంది చిన్నారులు లబ్ధి పొందారు.ఈ ముగింపు కార్యక్రమంలో చెరుకూరి లక్ష్మీ కళ్యాణి తో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ సతీమణి అమృతా సిన్హా,కడప మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ కె. రాకేష్ చంద్ర,ఆర్తి హోమ్ అధ్యక్షురాలు పుచ్చలపల్లి సంధ్య కార్యదర్శి దుర్గా కుమారి,సభ్యులు డా. బాలి రెడ్డి డా.పి. శ్రీనివాసులు రెడ్డి , పిచ్చయ్య చౌదరి, భద్రమ్మ , ఆర్తి స్కూల్ డైరెక్టర్ భాగ్యమ్మ, ఎల్‌సీఆర్ ఫౌండేషన్ ( యు ఎస్ ఏ ) సభ్యులు,ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభు గారు తదితరులు పాల్గొన్నారు.శిబిరం మొత్తం కాలంలో చిన్నారులకు గణితం, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, సామాజిక శాస్త్రాలు, నృత్యం, సంగీతం, చిత్రలేఖనం మరియు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ అందించారు. ఆర్తి స్కూల్ ఉపాధ్యాయులు మరియు ఆర్తి విద్యా వికాస కేంద్రాల ప్రాజెక్టు ఫెసిలిటేటర్లు ఈ శిక్షణను నిర్వహించారు. చిన్నారుల ఆరోగ్యం, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజూ పోషకాహారంతో కూడిన అల్పాహారం,మధ్యాహ్నానికి ముందు చిరుతిండి మరియు మజ్జిగ అందించారు.జూన్ 10న ఆర్తి విలేజ్‌లో నిర్వహించిన ముగింపు కార్యక్రమంతో వేసవి శిబిరం ముగిసింది. శిబిరంలో నేర్చుకున్న నైపుణ్యాలను ప్రతిబింబిస్తూ చిన్నారులు ఉత్సాహ భరితమైన ప్రదర్శనల ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించారు. పాల్గొన్న చిన్నారులకు సర్టిఫికెట్లు,పతకాలు మరియు బహుమతులు అందజేశారు. వీడ్కోలు సందర్భంగా చిన్నారులు మరియు వారి తల్లిదండ్రులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ఈ



కార్యక్రమానికి చిన్నారులు,తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు ప్రముఖులతో కలిపి 600 మందికి పైగా హాజరయ్యారు. ఎల్‌సీఆర్ ఫౌండేషన్‌కు చెందిన ప్రతినిధులు కూడా కార్యక్రమాన్ని సందర్శించి అభినందించారు. వేసవి సెలవులను చిన్నారులు ప్రయోజనకరంగా వినియోగించుకున్నారని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించాలని వారు ఆకాంక్షించారు. ఆర్తి స్కూల్,ఆర్తి ఫర్ గర్ల్స్ సిబ్బంది, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల సహకారంతో కార్యక్రమం విజయవంతమైంది. వెనుకబడిన వర్గాలకు చెందిన చిన్నారుల విద్య, సాధికారత మరియు సమగ్ర అభివృద్ధి పట్ల ఆర్తి ఫర్ గర్ల్స్ సంస్థకు ఉన్న నిబద్ధతకు ఈ వేసవి శిబిరం నిదర్శనంగా నిలిచింది.

# నంద్యాలలో టిడిపి పట్టణ స్థాయి నాయకుల కీలక సమావేశం

### రాబోయే ఎన్నికల పై దిశానిర్దేశం చేసిన ఎన్ఎండి ఫిరోజ్





**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 10 ( నంది పత్రిక )** నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో (దబ్బరాల మసీద్ సమీపంలో) బుధవారం నంద్యాల పట్టణ స్థాయి పార్టీ నాయకుల ముఖ్య సమావేశం ఘనంగా నిర్వహించబడింది. నంద్యాల పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాబోయే రోజుల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చూడాలని అలాగే దొంగ ఓట్లు ఏవైనా ఉంటే వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని, పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఎన్ఎండి ఫిరోజ్ దిశానిర్దేశం చేశారు. మునియార్ ఖలీల్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి మరియు పార్టీ అభ్యున్నతికి నాయకులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని కోరారు. అలాగే ప్రతి వార్డు తిరిగి ఓటర్ జాబితాలను సరిచూసుకొని అందులో ఏవైనా దొంగ ఓట్లు ఉంటే వాటిని వెంటనే మా దృష్టికి కానీ ఎలక్షన్ అధికారులకు కానీ తెలియజేయాలన్నారు. 2002లో ఓటర్ జాబితాని 2026 ఓటరు జాబితాని సరి చూడాలని ఎవరైనా ఊరి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన, మరణించిన వారి ఓట్లు , డబల్ ఎంట్రీ ఓట్లను గమనించి వాటిని అధికారులకు తెలియజేయాలన్నారు ఈ సమావేశంలో పట్టణ స్థాయి కీలక నాయకులు, పార్టీ ముఖ్య నేతలు మరియు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సమష్టి చర్యలు అవసరం





### జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి రహదారుల ఎన్ఫోర్స్మెంట్ చర్యలను కఠినతరం చేయాలి.

**కడప, బ్యూరో చీఫ్ జూన్ 10 నంది పత్రిక** వైఎస్సార్ కడప జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్యను మరింత తగ్గించి, ప్రాణనష్టాలను నివారించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా రహదారి భద్రతా కమిటీ (డి ఆర్ ఎస్ సి ) చైర్మన్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో.. జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో.. జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ డా. శ్రీధర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఏఎస్పీలు విభూకృష్ణ, రామ్నాథ్ హెగ్డే హాజరయ్యారు.

జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో రోడ్డు ప్రమాదాల గణాంకాలు, జీరో ఫెటాలిటీ డిస్ట్రిక్ట్ కార్యక్రమం, హైవేలపై ఆక్రమణల తొలగింపు, పీఎం రాహత్ పథకం అమలు, కడపరేణిగుంట జాతీయ రహదారి మరమ్మతుల పురోగతిపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... రోడ్డు భద్రత చర్యల ఆంక్షలను జిల్లాలో మరింత కఠినతరం చేసి.. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలో 2026 మే నెల వరకు నమోదైన రోడ్డు ప్రమాదాల వివరాలను పరిశీలించిన కలెక్టర్, ప్రమాదాల మొత్తం సంఖ్య స్వల్పంగా తగ్గినప్పటికీ ప్రమాద మరణాలు, హెల్మెట్ వినియోగం లేకపోవడం వంటి అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల మధ్య ప్రమాదాలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో ఆ సమయాల్లో ప్రత్యేక నిఘా, పటిష్ట ట్రాఫిక్ అమలు చర్యలు చేపట్టాలని పోలీసు శాఖకు సూచించారు.జిల్లాలో గుర్తించిన 51 బ్లాక్‌స్పాట్లు, 125 జీరో ఫెటాలిటీ క్రాష్ ప్రోన్ ప్రాంతాలు, 162 యాక్షనబుల్ ప్రదేశాల వద్ద తక్షణ భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న బ్లాక్‌స్పాట్‌ల సవరణ పనులను వేగవంతం చేసి, హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, సోలార్ లైటింగ్, ట్రాఫిక్ సూచికల ఏర్పాటు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు కొనసాగించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారి డ్రైవింగ్ లైసెన్సుల సస్పెన్షన్ ప్రక్రియను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. హైవేలపై అక్రమ పార్కింగ్, అనధికార మీడియన్ ఓపెనింగ్‌లు, ఆక్రమణలు ప్రమాదాలకు కారణమవుతున్నందున సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక హైవే భద్రతా టాస్క్‌ఫోర్స్, సర్వైలెన్స్ బృందాలు సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రధాన రహదారులపై ప్రమాద నివారణ చర్యలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని స్పష్టం చేశారు.పీఎం రాహత్ (క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్) పథకం అమలు, గోల్డెన్ అవర్‌లో బాధితులకు వైద్య సేవల అందుబాటుపై కూడా సమీక్ష నిర్వహించారు. ప్రమాద బాధితులకు తక్షణ వైద్యం అందేలా అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న రహదారులపై ఎన్ఫోర్స్మెంట్ చర్యలను కఠినతరం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారుల్లో డివైడర్లను బ్రేక్ చేసి.. వాహన ప్రమాదాలకు అవకాశం కల్పిస్తున్న వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలన్నారు. రియల్టర్లు, రాజకీయ ప్రమేయాలకు స్పందించకుండా రోడ్డు భద్రతా ఆంక్షలను పాటించాలన్నారు. రోడ్లు ప్రమాదాలకు.. ఎన్ఫోర్స్ మెంట్ అధికారుల నిర్లక్ష్యం కారణం కాకూడదన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి కేసులు ఫైల్ చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో కమర్షియల్, అధిక జన సంచార ప్రాంతాల్లో రోడ్డు భద్రతా చర్యల్లో ఆయా మున్సిపల్ కమిషనర్లు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రజల ప్రాణ భద్రత కోసం రూల్స్ అతిక్రమించే వారిపై ఫైన్లు, కేసులు నమోదు చేయాలన్నారు. అన్ని విద్యా సంస్థల్లో రహదారుల భద్రతకు అవసరమైన నియంత్రణ చర్యలు, అత్యవసర సహాయక చర్యలు, నియమ నిబంధనలు మొదలైన వాటిపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ వీర్రాజు, కే ఎంసి అధనపు కమిషనర్ రాకేష్ చంద్రం, కమిటీ సభ్యులైన జిల్లా.వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నాగరాజు, ఆర్ అండ్ బి శాఖ ఎస్.ఈ. చంద్రశేఖర్, నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులు, ట్రాఫిక్, పోలీసు, రవాణా శాఖ అధికారులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# హరిత రాయబారిగా డిగ్రీ విద్యార్థి



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 10:** తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నపాటి పనులు చెప్పిన, వులకరు పలకరు. పిల్లలకు ఏ పనులు చెప్పినా పలకడం లేదు. ఎట్టాగబ్బా! వీళ్ళతో వేగేది అంటూ చాలామంది తల్లిదండ్రులు విసుగు చెందుతూ ఉంటారు. అయితే ఇందుకు భిన్నంగా ఓ సుపుత్రుడు తండ్రికి ఆపద వచ్చిందని, తండ్రికి చేదోడుగా వాదోడుగా ఉండాలంటూ, తాను డిగ్రీ చదువుతున్నప్పటికీ, మొహమాట పడక హరిత రాయబారిగా మారిపోయాడు. బండి ఆత్మకూరు గ్రామపంచాయతీలో హరిత రాయబారిగా పనిచేస్తున్న పెద్దన్న వారం రోజుల క్రితం ఒక ప్రమాదానికి గురి కావడంతో ఎడమ చేయి విరిగిపోయింది. ఈ కారణంగా గ్రామంలో చెత్తాచెదారాన్ని ఎత్తివేసేందుకు పెద్దన్న ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఈ విషయంపై కొడుకు సుమంత్ ను సాయంగా రమ్మని అర్థించాడు. సుమంతు నంద్యాలలోని ఒక ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. తండ్రి చెత్త బండికి సాయం రమ్మని అడిగిన మేరకు కసురుకోలేదు. గత రెండు రోజుల నుండి చెత్త బండి రిక్షాను ముందుకు తోసుకొని వెళుతూ ఉంటే, తండ్రి పెద్దన్న ఇళ్ల ద్వారా సేకరించిన చెదారాన్ని చెత్త బండిలో వేసుకుంటూ వెళ్తున్నాడు. గ్రామంలో గత రెండు రోజుల నుండి తండ్రి కొడుకులు చెత్తను సేకరించి పనిలో ఉన్నారు. డిగ్రీ చదువుతున్నావు కదా! చెత్త రిక్షాను నడిపేందుకు ఏమి ఇబ్బంది లేదు కదా అని డిగ్రీ విద్యార్థి సుమంత్ ను ప్రశ్నిస్తే, మౌనంగానే చెత్త బండి రిక్షాను తోసుకుంటూ ముందుకు వెళ్తున్నాడు.

# నారాయణపురంలో స్మశాన వాటిక శుభ్రం

**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 10 :** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న నారాయణపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలోని స్మశాన వాటికను బుధవారం అధికారులు శుభ్రం చేయించారు. ఎస్సీలకు సంబంధించి స్మశాన వాటిక స్థలంలో కంప చెట్లు పిచ్చి మొక్కలు పెరిగిపోయి అపరిశుభ్రంగా తయారైంది. చనిపోయిన వ్యక్తులను స్మశానానికి తీసుకెళ్లి వెళ్ళేందుకు తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని కొద్దికాలం క్రితమే ఎస్సీలు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై గ్రామ స్పెషల్ ఆఫీసర్ అన్నం పురుషోత్తం గ్రామ నాయకులు పెద్దలతో సంప్రదించారు. ప్రత్యేకంగా ప్రోక్ లైనర్ ను ఏర్పాటు చేయించి, కంప చెట్లను తొలగించి స్మశాన రస్తాను శుభ్రం చేయించారు. స్మశానపు రస్తాను మరింత బాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని స్పెషల్ ఆఫీసర్ పురుషోత్తం పేర్కొన్నారు. ఈ విషయంలో స్పందించిన గ్రామ నాయకులు పెద్దలకు స్పెషల్ ఆఫీసర్ కు ఎస్సీలు కృతజ్ఞతలు తెలియజేశారు.



# స్వచ్ఛపథం కార్యక్రమం...

**చాగలమర్రి జూన్ 10నంది పత్రిక** మండల పరిధిలోని జ్ఞానాపురం రోడ్డు నూతన వంతెన వరకు రోడ్డుకి ఇరువైపులా బుధవారం డిప్యూటీ ఎంపీడీవో చాగలమర్రి మేజర్ గ్రామపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తారకేశ్వరి ఆధ్వర్యంలో స్వచ్ఛ పథం కార్యక్రమం నిర్వహించారు. రోడ్డుకి ఇరుపక్కల చెత్తకుప్పలో పశువుల ఎరువులు తీసివేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఆదినారాయణ వెంకటేశ్వర్లు, పెద్ద వంగలి పంచాయతీ కార్యదర్శి చెన్ను డు, చిన్న వంగలి కార్యదర్శి ప్రదీప్ కుమార్ రెడ్డి, స్వర్ణ గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



# అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి.. అనర్హుల పేర్లకు తావివ్వొద్దు



### ప్రత్యేక ఓటరు జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలి: బీఎల్ఓలకు కలెక్టర్ దిశానిర్దేశం జూలై 21న డ్రాఫ్ట్ ఓటరు జాబితా.. సెప్టెంబర్ 22న తుది జాబితా విడుదల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, జూన్ 10(నంది పత్రిక):–** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టనున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్ –2026) కార్యక్రమాన్ని నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓలు) సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో బనగానపల్లె, డోన్ నియోజకవర్గాలకు చెందిన బీఎల్ఓలు, సూపర్వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ లు స్వయంగా పాల్గొని మార్గదర్శకాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో అనర్హుల పేర్లు ఓటరు జాబితాలో చేరకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఖచ్చితమైన సమాచారంతో ఓటరు జాబితాను రూపొందించాలని ఆదేశించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం–1950 ప్రకారం ఓటరు జాబితాల రూపకల్పన, ప్రజా ప్రాతినిధ్య చట్టం–1951 ప్రకారం ఎన్నికల నిర్వహణ జరుగుతుందని వివరించారు. తప్పుడు వివరాలతో డిక్లరేషన్ సమర్పించే ఓటర్లపై ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్–31 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన అధికారులపై సెక్షన్–32 కింద కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. జూన్ 15 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభం కానున్నప్పటికీ, అప్పటి వరకు వేచి ఉండకుండా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని వెంటనే ప్రారంభించాలని బీఎల్ఓలకు ఆదేశించారు. ప్రతి అర్హ ఓటరుకు ఫారం అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు రాజకీయ పక్షపాతం లేకుండా పూర్తిగా తటస్థంగా వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనే భావన కలగకుండా ప్రశాంతంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఓటరుగా నమోదు కావడానికి భారతీయ పౌరసత్వం కలిగి ఉండటం, 2026 జూలై 1 నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి కావడం, సంబంధిత ప్రాంతంలో సాధారణ నివాసిగా ఉండటం వంటి అర్హతలు అవసరమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలను సేకరించి డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. ఒకే ఫారాన్ని పునరావృతంగా డిజిటలైజ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, డిజిటలైజ్ చేసిన ఫారాలపై స్పష్టమైన గుర్తింపు ఉండాలని పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు తిరిగి రాని సందర్భాల్లో కేవలం 'ఆబ్సెంట్', 'షిఫ్టెడ్', 'డెత్', 'డూప్లికేట్' అనే నాలుగు కారణాలను మాత్రమే నమోదు చేయాలని సూచించారు. ఈ వివరాల ఆధారంగా బూత్ వారీగా ప్రత్యేక జాబితాలు తయారు చేసి ప్రజల అభ్యంతరాల కోసం అందుబాటులో ఉంచాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాను జూలై 21న ప్రచురించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అనంతరం క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ కొనసాగుతుందని, ఫారం6 ద్వారా కొత్త ఓటరు నమోదు, ఫారం7 ద్వారా పేర్ల తొలగింపు, ఫారం8 ద్వారా వివరాల సవరణ లేదా నియోజకవర్గ మార్పులు చేపట్టవచ్చని వివరించారు. అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్స్ పరిష్కరించిన అనంతరం సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలతో పాటు ఆధార్, రేషన్ కార్డు, పాత ఎపిక్ కార్డు వంటి పత్రాల జిరాక్స్ కాపీలు సేకరించవద్దని సూచించారు. అవసరమైన సందర్భాల్లో మాత్రమే ఎన్నికల సంఘం సూచించిన గుర్తింపు లేదా నివాస ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒకటి స్వీకరించాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్లను ఆదేశించారు. జూలై 14లోపు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రతిపాదనలను ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,200 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే పోలింగ్ కేంద్రాల విభజన చేపట్టాలని, అయితే ఒకే కుటుంబ సభ్యులు వేర్వేరు కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈఆర్ఓలను ఆదేశించారు. అలాగే ప్రతి ఏఈఆర్ఓ కార్యాలయంలో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేసి, హెల్ప్‌లైన్ నంబర్ 1950ను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. సిస్టమ్ గుర్తించిన లోపాలు, వ్యత్యాసాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిచేయాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఆర్ఓ రాము నాయక్, డోన్, బనగానపల్లె ఆర్డీఓలు, సంబంధిత నియోజకవర్గ మండలాల బీఎల్ఓలు, సూపర్వైజర్లు, ఏఈఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.



# తప్పులు లేని, ఖచ్చితమైన ఓటర్ల జాబితా కోసమే 'సర్' కార్యక్రమం

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి





**బీమవరం బ్యూరో చీఫ్ జూన్ 10నంది పత్రిక** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన "సర్" కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరును ప్రత్యక్షంగా కలుసుకొని, వారి వివరాలను ధృవీకరించడం ద్వారా తప్పులు లేని, శుద్ధమైన మరియు ఖచ్చితమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి బుధవారం ఈఆర్వోలు, ఏఈఆర్వోలకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొని "సర్" కార్యక్రమంపై సవివరంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, జూన్ 15వ తేదీ నుండి జూలై 14వ తేదీ వరకు జిల్లాలోని బూత్ లెవల్ అధికారులు (బి.ఎల్.ఓలు) ఇంటింటి పర్యటనలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఓటరుకు పాక్షికంగా నింపబడిన ఎన్యుమరేషన్ ఫారాలను అందజేసి, ఓటర్లు అవసరమైన సమాచారాన్ని పూర్తి చేసిన అనంతరం వాటిని తిరిగి సేకరిస్తారని వివరించారు. ఓటర్లు తమ వివరాలను లేదా తమ కుటుంబ సభ్యుల వివరాలను 2002 ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ రికార్డులతో అనుసంధానం చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి ఎలక్టోరల్ ఫారంపై సంబంధిత బి.ఎల్.ఓ ఫోన్ నెంబర్ అందుబాటులో ఉంటుందని, ఎలాంటి సందేహాలు ఉన్నా బి.ఎల్.ఓలను సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సి.ఈ.ఓ) వెబ్‌సైట్‌లో కూడా తమ వివరాలను తనిఖీ చేసుకునే అవకాశం ఉందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా జూలై 21న ప్రచురించబడుతుందని, ఆ తేదీ నుండి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్ మరియు అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. అందిన క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ సెప్టెంబర్ 18 వరకు కొనసాగుతుందని, అనంతరం సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితా ప్రచురించబడుతుందని పేర్కొన్నారు. ప్రజలందరూ బి.ఎల్.ఓలకు సహకరించి, సరైన వివరాలు అందజేసి ఓటర్ల జాబితా శుద్ధీకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బిఎల్ఓలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

# తాగునీరు, విద్యుత్, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం





### నీటి ఎద్దడిపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపాలి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు -- జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**కర్నూలు/నంద్యాల బ్యూరో, జూన్ 10(నంది పత్రిక):–** ఉమ్మడి కర్నూలు జిల్లాలో తాగునీటి సమస్యలు, విద్యుత్ భద్రత, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో నీటి ఎద్దడిని నివారించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని సూచించారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, విద్యాశాఖ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి, నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా పరిషత్ సీఈఓ రమణారెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, ఆదోని ఎమ్మెల్యే డా. పార్థసారథి వాల్మీకి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, ఉభయ జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, నంద్యాల, కర్నూలు జిల్లాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మదర్ వాటర్ ప్లాంట్లు, ఆర్డబ్ల్యూఎస్ వాటర్ ప్లాంట్లను పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 167కే రహదారి నిర్మాణంలో భాగంగా పైప్‌లైన్ల తొలగింపుకు ముందు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో నీటి ఎద్దడి అధికంగా ఉందని, వర్షపాతం నమోదవుతున్నప్పటికీ నీటి నిల్వల కోసం తగిన రిజర్వాయర్లు లేకపోవడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణ, నిల్వలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. విద్యుత్ శాఖకు సంబంధించి విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని, వాటిని వెంటనే సరిచేసి ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాల్లో మృతి చెందిన కుటుంబాలకు నష్టపరిహారం సకాలంలో అందించాలని, శాఖలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాశాఖలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాలని, పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపు కోసం అమలు చేస్తున్న ప్రత్యేక కార్యాచరణకు మరింత ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు.

**సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు -- జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి** అనంతరం సమావేశంలో సభ్యులు లేవనెత్తిన పలు సమస్యలు, అభ్యర్థనలపై జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్పందించారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖకు సంబంధించి జిల్లాలో ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ఈ–క్రాప్ నమోదైన ప్రతి రైతుకు అవసరమైన ఎరువులు అందేలా చర్యలు చేపట్టామని తెలిపారు. పంట మార్పిడి చేసిన రైతులకు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. దొర్నిపాడు మండలంలో శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంకు విషయంలో భద్రతా చర్యలు చేపట్టి ప్రమాద హెచ్చరిక బోర్డులు, కంచె ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. కొత్తపల్లి మండలంలో 167కే రహదారి నిర్మాణంలో భాగంగా రైతుల భూముల నుంచి మట్టి తవ్వకాలపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గడివేముల మండలం సోమాపురంలో ఇళ్లపైకి దిగువకు వచ్చిన విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక బృందాలను పంపించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా నాణ్యమైన విద్యుత్ సరఫరా కల్పించేందుకు చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. అలాగే

గువ్వలకుంట్ల–చిన్నపాలెం–సదరంచెరువు–ఎర్రగుడి చెరువు రహదారి పనులను వేగవంతం చేయాలని, ఆత్మకూరు నుంచి గువ్వలకుంట్ల వరకు విద్యార్థుల రాకపోకల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించే అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# జూన్ 12 నుండి ప్రభుత్వ పాఠశాలల ప్రారంభానికి పూర్తి స్థాయి సన్నద్ధత ఉండాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**బీమవరం బ్యూరో చీఫ్ జూన్ 10 నంది పత్రిక** వేసవి సెలవుల అనంతరం జూన్ 12 నుండి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని పాఠశాలలను పూర్తి స్థాయిలో సిద్ధం చేసి విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి విద్యాశాఖకు సంబంధించిన లైన్ డిపార్ట్మెంట్ల అధికారులతో నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సుమారు రెండు నెలలపాటు పాఠశాలలు మూసివేయబడినందున పాఠశాల ఆవరణల్లో అపరిశుభ్రత, మొక్కల పెరుగుదల, చెట్ల కొమ్మలు విరిగిపడటం, విషపురుగులు, పాములు, జెర్రీలు సంచరించే అవకాశం ఉందన్నారు. హెడ్ మాస్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, డీపీఓలు సమన్వయంతో తక్షణ చర్యలు తీసుకుని పాఠశాల పరిసరాలను పూర్తిగా శుభ్రపరచాలని ఆదేశించారు. అలాగే పాఠశాల భవనాల్లో స్లాబులు, పెచ్చులు ఊడిపోవడం, గోడలు బీటలు వారడం వంటి ప్రమాదకర పరిస్థితులు ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి అవసరమైన మరమ్మత్తులు పూర్తి చేసి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పాఠశాల ప్రారంభం రోజునుండే నిరాటంకంగా అమలుకావాలని తెలిపారు. అందుకు అవసరమైన బియ్యం, నిత్యావసర సరుకులు, గ్యాస్ సిలిండర్లు తదితర సామగ్రి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ముందుగానే సిద్ధంగా ఉంచాలని డీఎస్ఓ మరియు సివిల్ సప్లయిస్ అధికారులను ఆదేశించారు. ప్రైవేటు పాఠశాలల బస్సులు పూర్తి ఫిట్నెస్‌తో ఉండేలా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని జిల్లా రవాణా అధికారికి సూచించారు. డ్రైవర్లకు కూడా ఆరోగ్య మరియు ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించేలా పాఠశాల యాజమాన్యాలకు అవగాహన కల్పించాలని చెప్పారు. విద్యార్థుల రవాణాలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జూన్ 11న నరసాపురం వలందరు రేవులో ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా జూన్ 14 మరియు 19 తేదీల్లో కూడా ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 21న జరిగే ప్రపంచ యోగా దినోత్సవం వరకు ప్రతిరోజు నిర్వహించే యోగా కార్యక్రమాల్లో పాఠశాల విద్యార్థులను భాగస్వామ్యులను చేయాలని సూచించారు. యోగాపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించేందుకు యోగా పోటీలు నిర్వహించి జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి అవార్డులు సాధించేలా ప్రోత్సహించాలని విద్యాశాఖ అధికారులను కోరారు. 'బడి పిలుస్తుంది' కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు అంగీకారం తెలిపిన ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో మంచి భవిష్యత్తు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, డీపీఓ వై.దోసిరెడ్డి, డీఎస్ఓ ఎన్.సరోజ, సివిల్ సప్లయిస్ డీఎం ఎండి ఇబ్రహీం, డీటీవో కృష్ణారావు, జిల్లా ఆయుష్ అధికారి శ్రీరామ్, డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలు, హెచ్ఎంలు, ఇంజనీరింగ్ అధికారులు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు..



# డిజిటల్ మిషన్ మోడల్ గా యాదాద్రి భువనగిరి జిల్లా

దేశవ్యాప్తంగా అమలు అవుతున్న ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) మోడల్ డిస్ట్రిక్ట్ ఇనిషియేటివ్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం నుండి యాదాద్రి భువనగిరి జిల్లా మోడల్ జిల్లాగా గుర్తింపు పొందిందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. ఈ నేపథ్యంలో, జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 4.00 గంటలకు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి పాల్గొన్నారు. జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వాహక అధికారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ మోడల్ డిస్ట్రిక్ట్ కార్యక్రమం అమలు విధానం, కార్యాచరణ ప్రణాళిక, లక్ష్యాలు, ఆశించిన ఫలితాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ, యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏ బి డి ఎం కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య సంస్థల్లో డిజిటల్ హెల్త్ సేవల విస్తరణ, ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ నమోదు, హెల్త్ ఫెసిలిటీ, హెల్త్ ప్రొఫెషనల్ రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ఏబీడియం మోడల్ డిస్ట్రిక్ట్ కార్యక్రమాన్ని ఆదర్శవంతంగా అమలు చేసి రాష్ట్రానికి, దేశానికి ఆదర్శంగా నిలిచే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యం. మనోహర్, ఏబీడీఎం నోడల్ అధికారి,

# ఆక్వా రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి ఎగుమతులకు అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**బీమవరం బ్యూరోచీఫ్ జూన్ 10 నంది పత్రిక** ఆక్వా రైతులు సాగు మరియు ఎగుమతులకు సంబంధించిన అన్ని అనుమతులు, రిజిస్ట్రేషన్లు తప్పనిసరిగా పొందడంతో పాటు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ సాగు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో మత్స్యశాఖ మరియు ఎంపెడా (ఎమ్ పి ఈ డి ఏ ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆక్వా రైతుల అవగాహన సదస్సులో బుధవారం జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆక్వా రైతులకు ఫార్మ్ రిజిస్ట్రేషన్, ఎంపెడా ఫార్మ్ ఎన్రోల్మెంట్, నాణ్యమైన రొయ్య పిల్లల ఎంపిక, ఎగుమతుల ప్రమాణాలు, ట్రేసబిలిటీ విధానం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా ఆక్వా రంగంలో రాష్ట్రంలోనే కీలక స్థానంలో ఉందని, ఈ గుర్తింపును మరింత బలోపేతం చేసేందుకు ప్రతి రైతు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ఆక్వా సాగులో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ముఖ్యంగా రొయ్యల సాగులో నిషేధిత మందులు, రసాయనాల వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. ప్రస్తుతం యునైటెడ్ స్టేట్స్ మరియు యూరప్ దేశాలకు ఎగుమతయ్యే ఆక్వా ఉత్పత్తులపై కఠిన నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎగుమతులకు పంపే సరుకులో సుమారు 50 శాతం వరకు పరీక్షలు నిర్వహించిన అనంతరం మాత్రమే కొనుగోలు జరుగుతోందని చెప్పారు. నాణ్యత ప్రమాణాలు పాటించని పక్షంలో రైతులు మరియు ఎగుమతిదారులు తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. 2029 జనవరి 10 నుండి ట్రేసబిలిటీ సర్టిఫికెట్ తప్పనిసరిగా అమల్లోకి రానుందని, ప్రతి రైతు ముందుగానే అవగాహన పెంచుకుని అవసరమైన రికార్డులు, నమోదులు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఉత్పత్తి నుండి ఎగుమతి వరకు ప్రతి దశలో పారదర్శకత, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు మంచి నాణ్యమైన సీడ్‌ను ఎంపిక చేసుకోవాలని, సాగులో శాస్త్రీయ పద్ధతులు అనుసరించాలని తెలిపారు. అప్పడా (ఏ పి ఈ డి ఏ) రిజిస్ట్రేషన్ మరియు ఎంపెడా ఎన్రోల్మెంట్ ప్రతి ఆక్వా రైతు తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేశారు. పండించిన ఉత్పత్తులకు వ్యాల్యూ ఎడిషన్ మరియు ప్రాసెసింగ్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత మంచి ధరలు పొందే అవకాశం ఉంటుందని అన్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో ప్రాసెసింగ్ నిర్వహించడం ద్వారా ఎగుమతుల అవకాశాలు మరింత విస్తరిస్తాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి డి.శ్రీనివాస్, ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్ పి.ఆనంద్, టెక్నికల్ ఆఫీసర్ దుర్గారావు, ఎఫ్‌డీఓలు, ఎగుమతిదారులు, ఆక్వా రైతులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# తోతాపురి రైతు సంక్షేమం ఓర్వలేకనే విష ప్రచారం

- అబద్ధాల రాతలతో రైతులను భయపెట్టాలని చూస్తున్నారు
- జగన్ హయాంలో దోపిడీ... చంద్రబాబు హయాంలో గిట్టుబాటు ధర
- తోతాపురి రైతులపై వైసీపీ కుట్రలను తిప్పికొడతాం
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి, బ్యూరో చీఫ్ జూన్ 10:నంది పత్రిక** తోతాపురి మామిడి రైతుల కష్టాలను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని చూస్తున్న వైసీపీ మాఫియా దౌర్భాగ్యపు కుట్రలను రాష్ట్ర ప్రజలు, రైతులు గమనిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతన్నకు అండగా నిలిచి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటుంటే, వాటిని జీర్ణించుకోలేక వైసీపీ అనుబంధ మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా అసత్య ప్రచారాలకు తెరలేపడం దురదృష్టకరమన్నారు. తోతాపురి మామిడి సాగుపై వైసీపీ పార్టీ అనుకూల పత్రిక ప్రచురించిన కథనం పూర్తిగా వాస్తవాలకు విరుద్ధమని, రైతుల్లో భయాందోళనలు సృష్టించేందుకు రాజకీయ కక్షతో అల్లిన అబద్ధాల పుట్ట అని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది తోతాపురి దిగుబడులు రికార్డు స్థాయిలో పెరిగినా, అంతర్జాతీయ మార్కెట్‌లో ఒడిదొడుకులు ఉన్నప్పటికీ రైతు నష్టపోకూడదనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ప్రతి కిలో తోతాపురి మామిడిపై రూ.4 సబ్సిడీ ప్రకటించిందన్నారు. ఫ్యాక్టరీల ద్వారా రూ.8 కొనుగోలు ధర లభించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అదనంగా ప్రభుత్వం అందిస్తున్న రూ.4తో రైతుకు మొత్తం రూ.12 గిట్టుబాటు ధర అందేలా చేస్తున్నామన్నారు.రాష్ట్రంలో తోతాపురి మామిడి ప్రధానంగా చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో సాగవుతోందని మంత్రి తెలిపారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు జిల్లా కలెక్టర్లు, తోతాపురి గుజ్జు, బాట్లింగ్ పరిశ్రమల యాజమాన్యాలతో ప్రభుత్వం పలుమార్లు సమీక్షలు నిర్వహించిందన్నారు. రైతుల వద్ద నుంచే నేరుగా పండ్లు కొనుగోలు చేయాలని, రైతులకు తగిన ధర చెల్లించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని వెల్లడించారు. రైతులు పూర్తిగా పండిన పండ్లను మాత్రమే కోయాలని, క్యూ లైన్ల సమస్య తలెత్తకుండా దశలవారీగా ప్రాసెసింగ్ యూనిట్లకు తరలించాలని రైతు సేవా కేంద్రాల ఇన్‌ఛార్జీలు, వ్యవసాయ మరియు ఉద్యాన శాఖ అధికారులు గ్రామ స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. ఉద్యాన శాఖ ప్రత్యేక కరపత్రాలు ప్రచురించి రైతులకు అవసరమైన సూచనలు అందిస్తోందన్నారు. ప్రస్తుతం 31 గుజ్జు పరిశ్రమలు కొనుగోళు ప్రారంభించాయని, జూన్ 9 నాటికి 62,404 మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని రైతుల నుంచి కొనుగోలు చేశాయని తెలిపారు. గత సీజన్‌లో ధరలు తగ్గిన సమయంలో రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కిలో తోతాపురి మామిడిపై రూ.4 అదనపు మద్దతు ధర ప్రకటించి, ఆ మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో డీబీటీ ద్వారా జమ చేసిందన్నారు. రైతు నష్టపోకుండా నిలబెట్టడం ప్రభుత్వ బాధ్యతగా భావించామని స్పష్టం చేశారు. రైతుల్లో అలజడి సృష్టించి, వారి కష్టాన్ని రాజకీయ లబ్ధికి ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతోనే వైసీపీ ఈ ఫేక్ రాజకీయాలకు తెరలేపిందన్నారు. ఆధారాలు లేకుండా సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. వైసీపీ నేతలకు చెందిన పల్ప్ ఫ్యాక్టరీలు సిండికేట్‌గా మారి రైతుల శ్రమను దోచుకున్నాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం కిలో రూ.8 ధరకు కొనుగోలు చేయాలని స్పష్టంగా సూచించినప్పటికీ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి చెందిన పిఎన్ఆర్ ఫుడ్స్ ప్రకాష్ రెడ్డికి చెందిన సీజీఆర్ ఫుడ్స్ సంస్థలు రైతులకు కేవలం రూ.3 మాత్రమే చెల్లిస్తున్నాయని ఆరోపించారు. టాసా, సన్నిధి వంటి సంస్థలతో కలిసి తక్కువ ధరలకు కొనుగోళ్లు చేస్తూ రైతులను నష్టపరుస్తున్నారని విమర్శించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మద్దతు ధరల కోసం కేవలం రూ.880 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, మామిడి ధర కిలో రూ.4కి పడిపోయినా రైతులను పట్టించుకోలేదని అచ్చెన్నాయుడు విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే మామిడి, పొగాకు, కోకో, కాఫీ, మిర్చి, టమాటా, ఉల్లి రైతులకు మద్దతు ధరల రూపంలో రూ.1,200 కోట్లు అందించి రైతులకు అండగా నిలిచిందన్నారు. గత ఏడాది మామిడి రైతులకు రూ.190 కోట్ల పరిహారం అందించామని వివరించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి తోతాపురి మామిడికి మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ వర్తించేలా చేయగలిగారని అచ్చెన్నాయుడు తెలిపారు. అదేవిధంగా మ్యాంగో పల్ప్‌పై 12 శాతం జీఎస్టీ తొలగించాలని, ఫ్రూట్ జ్యూస్‌లపై జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 50,922 మంది రైతుల నుంచి 3,08,261 మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. చిత్తూరులో 1.65 లక్షల టన్నులు, తిరుపతిలో 45 వేల టన్నులు, అన్నమయ్య జిల్లాలో 16,400 టన్నులు కొనుగోలు చేశామని చెప్పారు. మరో 81 వేల మెట్రిక్ టన్నుల మామిడిని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేశామన్నారు. మూడు జిల్లాల కలెక్టరేట్లలో కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేసి కొనుగోళ్లను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నామని, పార్లే ఆగ్రో, కోకాకోలా, పెప్సీ వంటి సంస్థలతో చర్చలు జరిపి రైతుల నుంచి నేరుగా కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వైసిపి మానస పత్రిక ఎన్ని కథనాలు రాసినా, వైసీపీ ఎన్ని దుష్ప్రచారాలు చేసినా, రైతులు నిజాలను గుర్తిస్తున్నారని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# నేడే (జూన్ 11న) నరసాపురం వలందర రేవు ప్రాంగణంలో ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమం



### జిల్లాలో ఉవ్వెత్తున కొనసాగుతున్న యోగా కార్యక్రమాలు
### ప్రతిరోజు యోగా మానసిక ఉల్లాసాన్ని అందిస్తుంది
### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**బీమవరం బ్యూరో చీఫ్ జూన్ 11నంది పత్రిక** పశ్చిమ గోదావరి జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు ప్రతిరోజు వాడవాడలా పెద్ద ఎత్తున విజయవంతంగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఇదే స్ఫూర్తితో జూన్ 11, 14, 19 మరియు 21 తేదీలలో నిర్వహించనున్న ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమాలలో జిల్లా ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. రేపు జూన్ 11న నరసాపురం వలందర రేవు ప్రాంగణంలో ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు, వృద్ధులు పాల్గొనాలని కోరారు. యోగ సాధన వ్యక్తిగత ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా మానసిక ప్రశాంతతను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. "ఆరోగ్యంగా ఉంటే అన్నీ ఉన్నట్టే" అనే భావనతో ప్రతి ఒక్కరూ నిత్య యోగాభ్యాసాన్ని జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న మానసిక ఒత్తిడులను తగ్గించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇంటి వద్దనే పిల్లలు, పెద్దలు సులభంగా యోగాసనాలను అభ్యసించవచ్చని, రోజుకు కొద్దిసమయం కేటాయించడం ద్వారా కుటుంబ ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పిల్లల మానసిక ఎదుగుదలకు కూడా దోహదపడుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పనుల ప్రదేశాలు, దేవాలయాల ప్రాంగణాలు, కళాశాలలు, సాంస్కృతిక కేంద్రాలు, కమ్యూనిటీ హాల్స్ తదితర ప్రాంతాలలో జూన్ 7వ తేదీ నుండి యోగా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21 వరకు యోగా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 4.5 లక్షల యోగా రిజిస్ట్రేషన్ల లక్ష్యంతో విస్తృత ప్రచారం, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. యోగం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ యోగా సాధనను అలవాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు.



## కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసి) నూతన శాఖ కార్యాలయం ప్రారంభం

**నంద్యాల బ్యూరో, జూన్ 10(నంది పత్రిక):** కార్మిక రాజ్య బీమా పథకం పరిధిలోని బీమా పొందిన కార్మికులు మరియు వారి కుటుంబ సభ్యులకు మెరుగైన సేవలు అందించేందుకు నంద్యాల పట్టణంలోని క్రాంతినగర్లో ఏర్పాటు చేసిన కార్మిక రాజ్య బీమా సంస్థ నూతన శాఖ కార్యాలయాన్ని ఈరోజు కార్మిక రాజ్య బీమా సంస్థ ఉప ప్రాంతీయ కార్యాలయం, తిరుపతి జాయింట్ డైరెక్టర్ డి. రాధాకృష్ణ గారు ప్రారంభించారు. నూతన శాఖ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఈఎస్ఐసి ఉప ప్రాంతీయ కార్యాలయం, తిరుపతికి చెందిన అసిస్టెంట్ డైరెక్టర్లు మధుసూదన్ గారు, రామకృష్ణ గారు, జేడీఐఎంఎస్ కడప జాయింట్ డైరెక్టర్ డా. అబ్దుల్ కరీం గారు, ఈఎస్ఐసి శాఖ కార్యాలయం, కర్నూలు బ్రాంచ్ మేనేజర్ బి. దుర్గా ప్రసాద్ గారు, రామకృష్ణ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ రామకృష్ణ గారు, నంద్యాల ప్రాంతంలోని ప్రముఖ యజమానుల ప్రతినిధులు, సుజలా పైప్స్, మహా సిమెంట్, జేఎస్ డబ్ల్యూ సంస్థల ప్రతినిధులు, బీమా పొందిన వ్యక్తులు, ఇన్సూరెన్స్ మెడికల్ ఆఫీసర్లు, ఈఎస్ఐసి అధికారులు, సిబ్బంది, అలాగే ఈఎస్ఐసి స్టాఫ్ యూనియన్ తిరుపతి జాయింట్ సెక్రటరీ ఎం. రాజేష్ గారు మరియు వైస్ ప్రెసిడెంట్ ఎల్. సందీప్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ డి. రాధాకృష్ణ కార్మిక రాజ్య బీమా పథకం ద్వారా అందించబడుతున్న వివిధ సామాజిక భద్రతా ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా డిపెండెంట్ బెనిఫిట్ పథకం గురించి వివరించి, అర్హులైన బీమా పొందిన వ్యక్తులకు డిపెండెంట్ బెనిఫిట్ సర్టిఫికెట్లను అందజేశారు. అదేవిధంగా, బీమా పొందిన వ్యక్తుల పిల్లలకు ఈఎస్ఐసి కోటా ద్వారా ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో నామమాత్రపు ఫీజుతో ప్రవేశం పొందే అవకాశాల గురించి వివరించి, కార్యక్రమానికి హాజరైన సభ్యులకు సమగ్ర సమాచారం అందించారు. నంద్యాల శాఖ కార్యాలయం ద్వారా జిల్లాలోని 1,035 మంది యజమానులు మరియు 17,958 మంది బీమా పొందిన వ్యక్తులకు వైద్య, నగదు మరియు ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాలు మరింత సమర్థవంతంగా అందుబాటులోకి రానున్నాయని ఆయన తెలిపారు.

## ఏఆర్ అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎం. చిన్ని కృష్ణ



**నంద్యాల క్రైం, జూన్10(నంది పత్రిక):-** నంద్యాల జిల్లా ఏఆర్ నూతన అడిషనల్ ఎస్పీ గా బి. చిన్ని కృష్ణ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన, ఈరోజు నంద్యాల జిల్లా ఆర్ అడిషనల్ ఎస్పీగా పదవీ బాధ్యతలు స్వీకరించడం జరిగింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అడిషనల్ ఎస్పీ బి. చిన్ని కృష్ణకి పోలీస్ శాఖలో సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో ఆయన చిత్తూరు, తిరుపతి, అనంతపురం, కడప, పల్నాడు, గుంటూరు వంటి పలు జిల్లాల్లో వివిధ హోదాల్లో సమర్థవంతంగా సేవలు అందించారు. అంతేకాకుండా, పోలీస్ శాఖలోని ప్రతిష్ఠాత్మక విభాగమైన 'గ్రేహౌండ్స్' లో కూడా ఆయన పనిచేశారు. ఇటీవల చిత్తూరులో విధులు నిర్వహించిన ఆయన, అక్కడ నుండి చీఫ్ ఆఫీస్‌కు బదిలీ అయి, ప్రస్తుతం పదోన్నతిపై నంద్యాల జిల్లాకు వచ్చారు.

## ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు మృతి వేల్పనూరు గ్రామంలో విషాద ఘటన



**వెలుగోడు, జూన్ 10 (నంది పత్రిక):** వెలుగోడు మండలం వేల్పనూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది.వేల్పనూరు గ్రామానికి చెందిన కొల్ల వెంకటేశ్వర్లు తన కొత్త ట్రాక్టర్‌తో నన్నూరు మహేష్‌కు చెందిన పొలం దున్నేందుకు డ్రైవర్ శివతో కలిసి బయలుదేరారు.ఒప్పి వాగు సమీపానికి చేరుకోగానే ట్రాక్టర్‌ను లింగాపురం శివ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో అదుపు తప్పి పంట కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ పై ప్రయాణిస్తున్న కొల్ల వెంకటేశ్వర్లు, లింగాపురం శివలకు తీవ్ర రక్త గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై బి సురేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మృతుడు కొల్ల వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులు కొల్ల పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## సారవంతమైన భూమితోనే అధిక దిగుబడులు. రైతులు భూసార పరిరక్షణపై దృష్టి పెట్టాలి.

**వెలుగోడు, జూన్ 10 (నంది పత్రిక):** రైతులు భూమి సారాన్ని పెంపొందించుకొని భూమిని పరిరక్షించుకోవాలని, వర్షాభావ పరిస్థితులను తట్టుకునే పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. ఖేతి బచావో అభియాన్ / దర్తిమాత బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం, నంద్యాల శాస్త్రవేత్తలు వెలుగోడు మండలం రేగడ గూడూరు, అబ్దుల్లాపురం గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె. రమణమ్మ మాట్లాడుతూ జీవన గ్యాస్ ప్రాముఖ్యత, విత్తన శుద్ధి విధానాలు, పంటల్లో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అధిక మోతాదులో రసాయన వినియోగం వల్ల చీడపీడలు, తెగుళ్ల ఉధృతి పెరిగే అవకాశం ఉందని తెలిపారు. పంట తొలిదశలో వేప ఆధారిత నూనెలను పిచికారీ చేయడం ద్వారా పురుగులు, లార్వా దశలను నియంత్రించాలని సూచించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఏ. మల్లేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జనుము, జీలుగ, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట పంటలను ఎకరాకు 10 కిలోల చొప్పున విత్తి 45 రోజుల తర్వాత పొలంలో కలియదున్నడం ద్వారా భూమికి పోషకాలు అందడంతో పాటు కర్బన శాతం పెరుగుతుందని తెలిపారు. దీనివల్ల సూక్ష్మజీవులు, వానపాములు పెరిగి భూమి గుల్లబారి పంటలకు అనుకూలంగా మారుతుందని వివరించారు.అలాగే రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకొని, వాటి ఆధారంగా వినియోగం చేపట్టాలని సూచించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున తక్కువ నీటితో సాగు చేయగల కొర్ర, సజ్జ, ఆముదం, మినుము, రాగులు, నువ్వులు వంటి పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. డీఆర్సీ అగ్రికల్చర్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ రూపొందించిన చీడపీడల గుర్తింపు యాప్‌ను రైతులు తమ మొబైల్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకొని పంటలకు సోకే తెగుళ్లను గుర్తించి, వ్యవసాయ శాఖ సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అధిక పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వెలుగోడు మండల వ్యవసాయ అధికారి స్వాతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా ఆర్థికాభివృద్ధికి హార్టికల్చర్, పశుసంవర్ధక రంగాలే కీలకం

**వనరులను సమర్థవంతంగా వినియోగిస్తే నంద్యాలను రాష్ట్రంలోనే అగ్రగామి జిల్లాగా తీర్చిదిద్దవచ్చు**

**ప్రజలకు వేగవంతమైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, జూన్ 10(నంది పత్రిక):–** నంద్యాల జిల్లాలో అపారమైన సహజ, మానవ వనరులు ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోవడం వల్ల అభివృద్ధి అవకాశాలు పరిమితమవుతున్నాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అభివృద్ధి, ప్రజల ఆదాయ వృద్ధి, ప్రభుత్వ సేవల మెరుగుదలపై గుర్తింపు పొందిన సేవాసంఘాల సభ్యులతో మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో వ్యవసాయ మరియు అనుబంధ రంగాల వాటా 42 శాతం, సేవా రంగం వాటా 39 శాతం ఉండగా, పారిశ్రామిక రంగం వాటా కేవలం 19 శాతం మాత్రమే ఉందన్నారు. పరిశ్రమల ద్వారా వచ్చే ఆదాయం తక్కువగా ఉండటం వల్ల జిల్లా ఆర్థికాభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగడం లేదని పేర్కొన్నారు. పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు అధిక ఆదాయం అందించే రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ప్రస్తుతం కేవలం 37 వేల హెక్టార్లలో సాగవుతున్న హార్టికల్చర్ పంటల ద్వారా సుమారు రూ.7 వేల కోట్ల ఆదాయం లభిస్తుండగా, దాదాపు 2.5 లక్షల హెక్టార్లలో సాగవుతున్న వరి మరియు ఇతర సాంప్రదాయ పంటల ద్వారా కేవలం రూ.3 వేల కోట్ల ఆదాయం మాత్రమే వస్తోందని వివరించారు. ఈ గణాంకాలే తోటపంటల ఆర్థిక ప్రాధాన్యతను స్పష్టంగా తెలియజేస్తున్నాయని అన్నారు. రైతుల ఆదాయాలను పెంచాలంటే హార్టికల్చర్, పశుసంవర్ధక రంగాల విస్తరణకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నంద్యాల జిల్లాలో వనరులు సమృద్ధిగా ఉన్నప్పటికీ ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులలో 20 శాతం కూడా పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నామని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు కేవలం కార్యాలయాల్లో కూర్చుని ఫైళ్లు క్లియర్ చేయడం మాత్రమే కాకుండా, ప్రజల అవసరాలను అర్థం చేసుకుంటూ సానుభూతి, బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారం, జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ఉద్యోగుల నుండి పనితీరు మెరుగుపరచడానికే తన సమయం ఎక్కువగా వెచ్చించాల్సి వస్తోందని, దీంతో కొత్త అభివృద్ధి కార్యక్రమాలపై మరింత దృష్టి సారించే అవకాశాలు తగ్గిపోతున్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రతి శాఖ అధికారి బాధ్యతాయుతంగా పనిచేస్తే జిల్లా అభివృద్ధి వేగవంతం అవుతుందని చెప్పారు. గతంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు ప్రాధాన్యత ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ గవర్నెన్స్'కు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు సేవలు ఎంత వేగంగా, సమర్థవంతంగా అందుతున్నాయన్నదే ప్రభుత్వ పనితీరుకు కొలమానంగా మారిందన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు త్వరితగతిన సేవలు అందించేందుకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఉద్యోగులు ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పనిచేయాల్సిన సందర్భంలో కొన్నిసార్లు రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో నిజాయితీగా, నిబంధనల ప్రకారం పనిచేసే ఉద్యోగులకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రతి ఉద్యోగి తటస్థ వైఖరితో వ్యవహరిస్తూ, సర్వీస్ మరియు క్లాసిఫికేషన్ నిబంధనలను పాటిస్తూ విధులు నిర్వర్తిస్తే చాలా సమస్యలు సులభంగా పరిష్కారమవుతాయని తెలిపారు. జిల్లా అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే నంద్యాల జిల్లాను రాష్ట్రంలోనే టాప్-5 జిల్లాల్లో ఒకటిగా నిలబెట్టడం సాధ్యమవుతుందని కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు.

# నేటి విద్యార్థులే రేపటి హమాలీలు



**ఆళ్లగడ్డ ప్రతినిది జూన్ 10 నంది పత్రిక** ప్రైవేటు మరియు ప్రభుత్వ పాఠశాలలో విద్యా విధానాలు పరిశీలిస్తుంటే అవి విద్యార్థిని విద్యార్థుల పట్ల శాపంగా పరిణమిస్తున్నాయేమోనని పించగా మానదు ఇసుక మూటలల్లే బ్యాగులను మోస్తూ వెళుతుంటే నేటి విద్యార్థులేరేపటి హమాలీనేమో అని అనిపిస్తుంది ఒకవేళ రేపు పొద్దున్న విద్యార్థులు తమ విద్యాభ్యాసాన్ని ఉద్యోగ వేటలో ఉద్యోగం రాకపోతే మూటలు మోసే హమాలీలుగానైనా తమ బ్రతుకు లీడుస్తారేమో నన్న భావన వ్యక్తం అయ్యేలాగా ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల సమైక్యవేదిక వ్యవహారిక కార్యదర్శి ప్రముఖ చిత్రకారుడు విజయ్ ఒక వ్యంగ్య చిత్రాన్ని చిత్రించారు పరిగణలోనికి తెచ్చుకొని పున:లోచన ఆలోచన చేయగలదని విద్యాసంస్థలని కోరుచున్నానని విజయ్ తెలిపారు

నేడు (గురువారం) నరసాపురం వలందర రేవులో జరిగే మెగా యోగ కార్యక్రమానికి ప్రజలు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, ప్రజా ప్రతినిధులు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలి.

## వినూత్నంగా, అందరినీ ఆకర్షించే విధంగా వలందర రేవులో మెగా యోగా కార్యక్రమం నిర్వహణ.

**జాయింట్ కలెక్టర్ టీ రాహుల్ కుమార్ రెడ్డి**



**బీమవరం బ్యూరో చీఫ్ జూన్ 10నంది పత్రిక** కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి యోగాంధ్ర2026 కార్యక్రమ నిర్వహణపై బుధవారం జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసాపురం వలందర రేవులో గురువారం ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు జరిగే మెగా యోగా కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆయన కోరారు. వినూతనంగా అందరినీ ఆకర్షించే విధంగా ఈ మెగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ జిల్లాలో జరుగుతున్న యోగా కార్యక్రమాలు, వెన్యూ రిజిస్ట్రేషన్, పౌరులు యోగ రిజిస్ట్రేషన్ ప్రక్రియ,యోగ పై పోటీలు నిర్వహణ తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. జిల్లాలో తణుకు మండలం మినహా మిగిలిన మండలాలలో సిటిజన్స్ రిజిస్ట్రేషన్, యోగా కార్యక్రమాల నిర్వహణలో వెనుకబడి ఉండటం పట్ల జాయింట్ కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. సిటిజన్స్ రిజిస్ట్రేషన్, వెన్యూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసి రెండు రోజుల్లో నిర్దేశించిన లక్ష్యసాధనకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. యోగ పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. జిల్లాకు నిర్దేశించిన 4.5 లక్షల సిటిజన్స్ రిజిస్ట్రేషన్ లక్ష్యసాధనకు గ్రామ, మండల, డివిజనల్, జిల్లా స్థాయి అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లా అధికారులు, మండల, డివిజనల్ స్థాయి అధికారులు వారి సిబ్బంది సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు అందరూ యోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో రోజువారి జరుగుతున్న యోగా కార్యక్రమాలపై సమీక్షించి, ప్రతి సచివాలయ, పురపాలక సంఘాల పరిధిలో ప్రతిరోజు యోగా కార్యక్రమాలు నిర్వహించి సంబంధిత ఫోటోలను యోగాంధ్ర యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు. యోగ పై కాంపిటీషన్స్ నిర్వహినపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. యోగాంధ్ర2026 కార్యక్రమం విజయవంతంగా నిర్వహించి రాష్ట్రంలో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ అధికారులను కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఘన సన్మానం



**మోడల్ స్కూల్లో సీట్లు సాధించిన చంద్రపల్లి విద్యార్థులు**

**ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు: కే.బీ. దామోదర్ నాయుడు**

**నందిపత్రిక –ప్యాపలి** మండలంలోని చంద్రపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. గత విద్యాసంవత్సరం ఏప్రిల్ నెలలో నిర్వహించిన మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో చంద్రపల్లి ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు లక్ష్మీనరసింహ, ధనవిక ఉత్తీర్ణత సాధించి, డోన్ మోడల్ స్కూల్లో సీట్లు కైవసం చేసుకున్నారు. రెండు రోజుల క్రితమే ఈ విద్యార్థులు డోన్ మోడల్ స్కూల్లో చేరారు. ఈ విద్యావిజయాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం చంద్రపల్లి గ్రామంలోని రచ్చకట్ట వద్ద గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో పాఠశాల తరఫున విద్యార్థులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ లతీఫ్, ఉపాధ్యాయులు శివకేశవులు విద్యార్థులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ లతీఫ్ మాట్లాడుతూ.. "గత సంవత్సరం జూన్ 9వ తేదీన నేను ఇక్కడ విధుల్లో చేరిన రోజే విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దుతానని గ్రామానికి మాట ఇచ్చాను. ఈ రోజు మా పాఠశాల విద్యార్థులు మోడల్ స్కూల్ సీట్లు సాధించి నా మాటను నిలబెట్టడం ఎంతో ఆనందంగా ఉంది" అని హర్షం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి వేలకు వేలు ఫీజులు కట్టి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా, అన్ని వసతులూ ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని ఆయన కోరారు. బిజెపి మండల అధ్యక్షులు, గ్రామ నాయకులు కే.బీ. దామోదర్ నాయుడు మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ లతీఫ్ పాఠశాల బాధ్యతలు స్వీకరించిన తర్వాత చంద్రపల్లి పాఠశాల పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ప్రశంసించారు. ఆయన ఇచ్చిన మాట ప్రకారం విద్యార్థులను మోడల్ స్కూల్ సీట్లకు అర్హులుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులంతా ప్రభుత్వ పాఠశాలలనే ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.

పాఠశాల విద్యార్థులు సాధించిన ప్రగతిని చంద్రపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు లక్ష్మీనారాయణకు వివరించగా, ఆయన సానుకూలంగా స్పందించారు. తన తండ్రి జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థులందరికీ ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తానని లక్ష్మీనారాయణ ఈ సందర్భంగా మాట ఇచ్చారు. లక్ష్మీనారాయణ ఉదారతకు గ్రామస్తులు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గవర్నర్ చే డాక్టరేట్ పట్టా అందుకున్న కాటేపోగు రాజ్ కుమార్




**జూపాడుబంగ్లా: జూన్ :10: (నంది పత్రిక )**పట్టుదల, కృషి ఉంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తరిగోపుల గ్రామానికి చెందిన యువ పరిశోధకుడు కాటేపోగు రాజ్‌కుమార్ నిరూపించారు. నంద్యాల జిల్లా,జూపాడు బంగ్లా మండలం, తరిగోపుల గ్రామానికి చెందిన కాటేపోగు వెంకటేశ్వర్ల కుమారుడు కాటేపోగు రాజ్‌కుమార్ తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పట్టా సాధించడం ఆనందముగా ఉందన్నారు .బుధవారం వెంకటేశ్వర యూనివర్సిటీలో స్నాతకోత్సవకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ అయిన ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ పట్టానుఅందుకున్నారు.పరిశోధనా రంగంలో విశేష కృషి చేసి అత్యున్నత విద్యార్హతను సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీ వేంకటేశ్వరవిశ్వవిద్యాలయం రాష్ట్రంలోని ప్రతిష్ఠాత్మక ఉన్నత విద్యా సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందింది.గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చినకాటేపోగు రాజ్‌కుమార్ డాక్టరేట్ పట్టా సాధించడం మండలానికి గర్వకారణమని పలువురు విద్యావేత్తలు పేర్కొన్నారు. ఆయన సాధించిన విజయం గ్రామీణ విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, యువకులు రాజ్‌కుమార్‌ను అభినందిస్తూ భవిష్యత్తులో పరిశోధనా రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.తరిగోపుల గ్రామం నుంచి డాక్టరేట్ పట్టా సాధించి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అందుకోవడం అరుదైన ఘనతగా గ్రామస్తులు పేర్కొంటూ ఆనందం వ్యక్తం చేశారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ ఘటన 9 మంది మృతి బాధాకరం.

**మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన రాష్ట్ర కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప.**

**రాజకీయ దుష్ప్రచారం వద్దు బాధితుల కుటుంబాలకు అండగా నిలుద్దాం.**



**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విశాఖ స్టీల్ ప్లాంట్ వర్కర్స్ ఈరోజు కొంత అప్రమతంగా ఉండడంతో తొమ్మిది మంది మృతి చెందారు, ఇది ఎంతో బాధాకరం అని దిగ్భ్రాంతికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప బాధపడ్డారు దీన్ని రాజకీయ దుష్ప్రచారం చేయకుండా బాధిత కుటుంబాలకు అండగా నిలిచి తగిన పరిహారం అందించడంలో ముందడుగు వేయాలని చైర్మన్ సూచించారు ఈ ఘటన జరగడానికి కారణం తెలుసుకొని తగిన చర్యలను ప్రభుత్వం తీసుకుంటుంది కానీ కొన్ని రాజకీయ పార్టీలు దీన్ని రాజకీయ దుష్ప్రచారానికి పాల్పడుతున్నాయి ఇది ఎవరు నమ్మదండి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏ ఒక్క ప్రజకు అన్యాయం జరగకుండా చూసుకునే బాధ్యత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీసుకున్నారు అదే బాటలో తనయుడు యువనేత నారా లోకేష్ ప్రజలతో ఎల్లప్పుడూ అండగా ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలతోనే సమయం గడుపుతూ ఉంటారు ఈ ఘటన జరిగిన కొన్ని గంటలకే నారా లోకేష్ అక్కడికి చేరుకుని ఆ ఘటనకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొని మృతి చెందిన బాధిత కుటుంబాలకు భరోసా కల్పించడానికి ముందడుగు వేశారు ఆ కుటుంబ సభ్యులతో నేరుగా మాట్లాడడం జరిగింది. ఆ కుటుంబాలను ఈ ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా కల్పించారు కానీ కొన్ని పనికిమాలిన రాజకీయ పార్టీలు దీన్ని అడ్డుపెట్టుకొని దుష్ప్రచారానికి పాల్పడుతున్నాయి అది ఎవరు నమ్మదండి లోకేష్ బాబు ఉన్నంతవరకు ఆంధ్ర రాష్ట్రంలో ఏ కుటుంబానికి కూడా అన్యాయం జరగకుండా చూసుకునే బాధ్యత లోకేష్ తీసుకుంటారు ఎవరు అధైర్య పడకుండా ఉండాలని చైర్మన్ సూచించారు

# బేటి బచావో బేటి పడావో

**ఆళ్లగడ్డ ప్రతినిది జూన్ 10 నంది పత్రిక** ఆళ్లగడ్డ మండలం పరిధిలో చింతకొమ్మదిన్నె గ్రామంలోని వి బి జి రామ్ ఉపాధి హామీ లో పని చేసే కూలీలకు భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు బాల్య వివాహాల గురించి ఫోక్సొ యాక్ట్ మహిళలపై లైంగిక వేధింపులు మూఢనమ్మకాలు వీటిపై ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త శ్రీదేవి ఫీల్డ్ ఆఫీసర్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ కలిసికట్టుగా పని చేయాలి





### టిడిపి తాలూకా పరిశీలకులు-
### - ఏపీ కోపరేటివ్ చైర్మన్ దేవల్ల మురళి

**ఆళ్లగడ్డ, ప్రతినిధి జూన్ 10 నంది పత్రిక** రాష్ట్ర టిడిపి పార్టీఅధిస్థానం ఆదేశించిన పనులలో క్షేత్ర స్థాయిలో అందరూ కలిసి కట్టుగా పని చెయ్యాలని ఇందులో రాజీ పడేది లేదని టిడిపి తాలుకా పరిశీలకులు, ఏపి కోఆపరేటివ్ చైర్మెన్ దేవల్ల మురళి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలోని కార్యాలయంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో నియోజకవర్గం లో వార్డు మ్యాపింగ్ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఓటర్ మ్యాపింగ్ కోసం 14 వ తేది వరకు సమయం ఉంది తాలుకాలోని ఆరు మండలాల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్చార్జులు , బూత్ కన్వీనర్లు , సీనియర్ నాయకులు అందరూ కలిసి ఓటర్ మ్యాపింగ్ కోసం పని చేయ్యాలన్నారు. ఇది పార్టీకి ఎంతో కీలకం కాబట్టి అధిస్థానం ఇందుకోసం శిక్షణ తరగతులు నిర్వహించి జాగ్రత్తపరచాలన్నారు . ముఖ్యంగా మన ఓటు ఉందా లేదా సరిచూసుకోవాలని లేకుంటే సంబంధిత అధికారుల వద్ద నమొదు చేయించు కోవాలన్నారు. గత ప్రభుత్వ హయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దొంగ ఓట్లు నమొదు చేయించి స్థానిక సంస్థలలో గెలుపోందారన్నారు. అలాంటి పరిస్థితి రాకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఓటరు నమొదు చేయించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్లు, జెడ్పిటీసీలు, మున్సిపాలటీలు అన్ని టిడిపి కైవసం చేసుకునేలా, ఓటర్ల నమోదు దొంగ ఓట్ల తొలగింపు కార్యక్రమం చేం యించాలని ఆయన సూచించారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల ప్రకారం ప్రతి ఒక్కరు కష్ట పడి బిఎల్ఎల సమన్వయంతో పని చేయ్యాలని కోరారు. అలాగే ఈ రెండు సంవత్సరాలలో తెలుగు దేశం పార్టీ కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును కూడా ఈనెల 14 తరువాత గ్రామ గ్రామన ప్రజలకు తెలియజేయ్యాలన్నారు. ఇందు కోసం ఇంటిటి కి వెళ్లి ప్రజలకు సూపర్ సి క్స్ పథకాల గురించి వివరించి వారికి జరిగిన మేలు గురించి చెప్పాలని తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష టిడిపి యునిట్ ఇన్చార్జీ సుబ్రమణ్యం, సంజీవ, సలాం తదితరులు పాల్గొన్నారు.

# బాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం పై వైసీపీ నిరసన ర్యాలీ

**బనగానపల్లె జూన్ 10నందిపత్రిక** చంద్రబాబు వెన్నుపోటుకు రెండేండ్లు కార్యక్రమం పై 12-06-2026 వ తేదీ బనగానపల్లె లో భారీ నిరసన కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందని వైసీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రామ్మోహన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు కార్యక్రమ వివరాలు వెల్లడిస్తూ బనగానపల్లె పట్టణం వైఎస్సార్సీపీ కార్యాలయం నుంచి మండల తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి మండల తహశీల్దార్ కార్యాలయ సమీపంలో భారీ సభను నిర్వహించబడునని ఈ ర్యాలీ కార్యక్రమానికి బనగానపల్లె నియోజకవర్గం లోని బనగానపల్లె, కోవెలకుంట్ల ,అవుకు, సంజామల,కొలిమిగుండ్ల మండల ప్రజా ప్రతినిధులు, మండల ఎంపీపీ లు,మండల వైస్ ఎంపీపీలు,ఎంపిటిసి లు,మాజీ సర్పంచ్ లు,మాజీ వార్డు మెంబర్లు,బూత్ లెవెల్ ఏజెంట్స్ ,వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ కన్వీనర్లు, సభ్యులు, అన్ని అనుబంధ సంఘాల కన్వీనర్లు, సభ్యులు ,సోషల్ మీడియా ప్రతినిధులు అందరూ తప్పక హాజరు అయి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు.

# హార్టికల్చర్ ద్వారా పాఠశాలలలో మొక్కల పెంపకానికి అనుమతులు

### - డిప్యూటీ ఎంపీడీవో సుబ్బారావు



**కొత్తపల్లి - నంది పత్రిక :** హార్టికల్చర్ ద్వారా మండలంలోని ఆయా పాఠశాలలలో మొక్కల పెంపకానికి అనుమతులు వచ్చాయని డిప్యూటీ ఎంపీడీవో సుబ్బారావు సూచించారు. బుధవారం మండల పరిధిలోని శివపురం గ్రామపంచాయతీలో శివపురం గూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల, పాలం చెరువు గూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలల లో ప్లాంటేషన్ కోసం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని శివపురం గూడెం, పాలెం చేరువు గూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలకు ఐటీడీఏ శాఖ తరపున హార్టికల్చర్ ద్వారా 25 సెంట్లలో ప్లాంటేషన్ చేసేందుకు ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చాయన్నారు. దీనికోసం స్థల పరిశీలన, కొలతలు చేయగా పాలెం చెరువు గూడెం ఆశ్రమ పాఠశాలలో స్థలం తక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. శివపురం ఆశ్రమ పాఠశాలలో పూర్తిస్థాయిలో స్థల పరిశీలన చేశామన్నారు. విద్యార్థులకు అహ్లాదకర వాతావరణాన్ని ఏర్పరచి, విద్యార్థులలో విద్యాభివృద్ధికి, పాఠశాలలపై ఆసక్తి కలిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థలాల వివరాలను నివేదికల రూపంలో జిల్లా కలెక్టర్ కు అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో అనుమతులు రాగానే ప్లాంటేషన్ ప్రక్రియ మొదలు పెడతామన్నారు.



# ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడితో మైనారిటీ ప్రతినిధుల సమావేశం.

### సర్ ప్రక్రియ పై మైనారిటీ వర్గాల ఆందోళనల నివృత్తికి సహకారం కోరుతూ. ఎం హెచ్ పి యస్ రాష్ట్ర అధ్యక్షుడు ఫరూఖ్ షబ్లీ ఆధ్వర్యంలో మైనారిటీ ప్రతినిధుల సమావేశం.

**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** ఎన్నికల సంఘం చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) ప్రక్రియ నేపథ్యంలో మైనారిటీ వర్గాలలో నెలకొన్న భయాందోళనలు, అపోహలను నివృత్తి చేయడంతో పాటు అవసరమైన అవగాహన కల్పించేందుకు సహకారం అందించాలని కోరుతూ మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఫరూఖ్ షబ్లీ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం ఎ పి యన్ జి ఓస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ తో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించి చర్చలు జరిపింది.ఈ సందర్భంగా ఫరూఖ్ షబ్లీ మాట్లాడుతూ, మైనారిటీ వర్గాలలో ఇప్పటికీ అధిక సంఖ్యలో ప్రజలు నిరక్షరాస్యులుగా ఉన్న నేపథ్యంలో (సర్) ప్రక్రియపై అనవసర అపోహలు, ఓటు హక్కు కోల్పోతామనే భయాలు కొంతమందిలో కనిపిస్తున్నాయని తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలోని 55 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అధిక శాతం మైనారిటీ ఓటర్లు ఉన్నందున,సామాజిక బాధ్యత కలిగిన ఇద్దరు చొప్పున మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ప్రతినిధులను నియమించినట్లు వెల్లడించారు. అలాగే సర్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు రాష్ట్ర కార్యాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక కాల్ సెంటర్‌ను నిర్వహిస్తూ మైనారిటీ ప్రజలకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.ఓటర్ల తనిఖీ ప్రక్రియలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు విధులు నిర్వహించే సమయంలో మైనారిటీ ఓటర్లకు సంబంధించిన అవగాహన లోపాలు లేదా ఇతర సమస్యలు ఎక్కడైనా ఎదురైతే, ఎన్నికల సంఘం నిబంధనలు మరియు చట్టపరమైన పరిధిలో ప్రజలకు అవసరమైన సహకారం అందించేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉందని ఫారూఖ్ షబ్లీ తెలిపారు. ఈ మేరకు సంబంధిత ప్రాంతాల్లో తమ ప్రతినిధులకు చట్ట పరంగా సహకరించాలని విద్యాసాగర్ ని కోరారు.ఈ సందర్భంగా స్పందించిన ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల సంఘం ఆదేశాలు, నియమావళికి కట్టుబడి అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సర్ ప్రక్రియను నిర్వహిస్తారని తెలిపారు. బూత్ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములుగా ఉంటారని పేర్కొన్నారు. మైనారిటీ ఓటర్లలో అవగాహన పెంపొందించేందుకు యం హెచ్ పి యస్ ముందుకు రావడం శుభపరిణామమని, సమాజ హితం కోసం పనిచేసే సంస్థలకు ఉద్యోగుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.ఎన్నికల అధికారులు తనిఖీ కోసం వచ్చినప్పుడు ఓటర్లు ఎన్నికల సంఘం సూచించిన అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకొని సహకరించాలని, ఎటువంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. మైనారిటీ ఓటర్ల రాజ్యాంగబద్ధ ఓటు హక్కు పరిరక్షణతో పాటు ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేందుకు ప్రభుత్వ ఉద్యోగులు, సామాజిక సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో అభిప్రాయపడినట్లు ఫారూఖ్ షబ్లీ తెలిపారు.ఈ సమావేశంలో ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.డి. జాని పాషా పాల్గొన్నారు.అలాగే సూఫీ మత గురువు మౌలానా అల్తాఫ్ రజా, ఎమ్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానా హుస్సేన్, సిటీ జామియత్ అహ్లె హదీస్ అధ్యక్షులు మౌలానా నసీర్ అహ్మద్ ఉమ్రి, ముఫ్తీ అబిద్ ఖాసిమి, అబ్దుల్ రహీద్, అబ్దుల్ ఘని తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



# పచ్చిరొట్ట ఎరువులతో బహుళ ప్రయోజనాలు



**మహానంది జూన్ 10 (నంది పత్రిక):-** పచ్చిరొట్ట ఎరువులతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ జోత్స్న కిరణ్మయి, డాక్టర్ గణేశ్, డాక్టర్ చంద్రబోస్ పేర్కొన్నారు. బుధవారం మహానంది మండలంలోని తిమ్మాపురం, అబ్బీపురం గ్రామాల్లో మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి ఆధ్వర్యంలో 'ఖేత్ బచావో అభియాన్'పై రైతులతో గ్రామసభలు నిర్వహించారు. భూ పరీక్షల ఆధారంగా ఎరువులను వాడాలన్నారు. ఎరువులను విచక్షణ రహితంగా వాడవద్దన్నారు.నేల సారవంత పెంపుదల, నేల కాలుష్యాన్ని అరికట్టడానికి అభిలంబించవలసిన వివిధ పద్ధతులను రైతులకు వివరించారు.ఎరువులను ఏ విధంగా ఎప్పుడు ఎలా నేలకు అందించాలని రైతులకు వివరించఇలా పైన చెప్పిన విధానాలను అభిలంబించడం ద్వారా రైతులు ఎరువుల వినియోగాన్ని తగ్గించి, నేలను ఆరోగ్యవంతంగా, సారవంతంగా ఉంచుకోవడమే కాక వాతావరణ కాలుష్యంను తగ్గించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో వివోఏ సుభాష్ చంద్రబోస్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యుత్ తీగలు తగిలి గేదె మృతి

**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 10 :** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న కాకనూరు గ్రామంలో విద్యుత్ తీగలు తగిలి 80000 రూపాయల విలువివ చేసే గేదె మృతి చెందింది. కాకునూరు గ్రామానికి చెందిన గొల్ల ఈశ్వరమ్మ గ్రామ పరిధిలోని కుందునది పొలాల దగ్గర గేదెలను మేపుకుంటూ ఉండగా పొలాల్లో ఉన్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. పాడి పెంపకం పైనే ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నామని, ఈ తరుణంలో తమ గేద మృతి చెందడం బాధాకరంగా ఉందని, ఈ విషయంపై ప్రభుత్వం ఆదుకొని తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# రైతు ట్రాన్స్ఫార్మర్ తీగల చోరి

**ఆళ్లగడ్డప్రతినిధి , జూన్ 10 నంది పత్రిక** ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల గ్రామంలో రైతు ట్రాన్స్ఫార్మర్ తీగలను బుధవారం దొంగలు చోరి చేశారు. గ్రామానికి చెందిన రైతు సత్యం రెడ్డి పొ లంలో వ్యవసాయానికి సంబంధించిన ట్రాన్స్ఫార్మర్ను ఏర్పాటు చేసుకొన్నాడు. మంగళవారం రాత్రి బాగానే ఉందని ఉదయం 8 గంటలకు పొలం వద్దకు వచ్చి చూస్తే ట్రాన్స్ ఫా ర్మరు' సిమెంట్ దిమ్మె నుంచి కింద పడేసి దాని లోని భాగాలను చోరి చేసి తీసుకెళ్లారని బాధిత రైతు తెలిపారు. 15 ఏళ్ల కిందట రూ.30 వేలు కట్టి ట్రాన్స్ ఫార్మర్ బిగించామని తెలిపారు. విషయాన్ని పోలీసులకు, విద్యుత్ అధికారులు పిర్యాదు చేశామని తమకు న్యాయం చేయ్యాలని బాధిత రైతు కోరారు.



# టీపీసీసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సిరెడ్డి భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు

నర్సారెడ్డి భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేయించి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుమార్ యాదవ్, దుడ్డు రాహుల్, గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలలకు దిక్సూచిగా కె.ఎం.పాండు మెమోరియల్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజ్





తాము పేదరికంలో జీవిస్తున్నా తమ పిల్లలు మాత్రం ఉన్నత చదువులు చదవాలని ఆలోచించే తల్లిదండ్రులు అప్పు చేసి మరి ఫీజులను చెల్లిస్తూ చదివిస్తుంటే, మరికొందరు తల్లిదండ్రులు మాత్రం తమకు ఉన్నత దాంట్లో పిల్లలను చదివించి ప్రయోజకులను చేయాలనుకుంటారు మరి కొంతమంది. ఇలాంటి వారికే వరప్రదాయనిగా మారింది కెఎం. పాండు మెమోరియల్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల కుత్బుల్లాపూర్ మొట్టమొదటిసారిగా ప్రైవేట్ కళాశాలలకు దీటుగా కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఔరా అనిపిస్తున్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే ఆ ప్రజా నాయకుడి తపన, ప్రైవేట్ కళాశాల దీటుగా ఆ ప్రభుత్వ కళాశాలలో అందుతున్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల బోధనా విధానం వెరిసి నేడు ఇంతటి విజయాన్ని చేకూర్చి పెట్టాయి.

**కళాశాల ఏర్పాటు ఉద్దేశ్యం..**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పేద విద్యార్థులకు ఉన్నతమైన వృత్తి విద్యను అందించాలనే లక్ష్యంతో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ ఎల్పి విప్ కేపీ.వివేకానంద్ గౌడ్ తన సొంత నిధులతో వారి తండ్రి కె.ఎం.పాండు జ్ఞాపకార్థం నిర్మింపచేసి 17 ఆగస్ట్ 2023 ప్రారంభోత్సవం చేసుకోగ మొదటి విద్య సంవత్సరంలో 368 విద్యార్థులతో ప్రారంభమైన ఈ కళాశాల 2025 - 2026 విద్యా సంవత్సరం నాటికి 926 మంది విద్యార్థులతో ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ప్రతి విద్యా సంవత్సరంలో విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య పెరుగుతూ ఇతర ప్రభుత్వ కళాశాలలకు దిక్సూచిగా మారింది.

**వినూత్నమైన వృత్తి విద్యా కోర్సులు, ఉపాధి కల్పనే లక్ష్యం..**

కళాశాల ప్రారంభమైన మొదటి విద్యా సంవత్సరం నుంచే లైఫ్ సైన్సెస్ కోర్సులతో పాటు ఉపాధిని కల్పించే కోర్సులను విద్యార్థులకు అందజేస్తూ కళాశాల మంచి పేరు గడిచింది. వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా బైపిసి, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఇసి కోర్సులతోపాటు మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ ( ఎంపిహెచ్డబ్ల్యు ), మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎం.ఎల్.టీ), కంపెనీ సెక్రటరీ (సిఎస్), ఎలక్ట్రికల్ టెక్నీషియన్ (ఈటీ), ఫార్మా టెక్నాలజీ వంటి కోర్సులను అందిస్తుండటంతో విద్యార్థుల ప్రవేశాలు ఘననీయంగా పెరిగాయి. గత విద్యా సంవత్సరంలో ప్రవేశపెట్టిన ఫార్మా టెక్నాలజీ కోర్సులోనూ 98% విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వ కళాశాలలు కూడా ప్రైవేట్ కళాశాలలకు ఏ మాత్రం తీసుకోవంటూ నిరూపించారు.

**మట్టిలో మాణిక్యాలు.. ఘనమైన ఫలితాలు..**

విద్యాభ్యాసంలో తమ పేదరికం ఎప్పటికీ అడ్డు కాదు అంటూ ఈ కళాశాల విద్యార్థులు 2026వ సంవత్సరంలో సాధించిన ఫలితాలే నిదర్శనం. ఈ క్రమంలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సులో జీ.భాగ్యశ్రీ (981) మార్కులు సాధించగా, ఎం.ఎల్.టీ కోర్సులో కే.పూజిత (970) మార్కులు సాధించగా, కంపెనీ సెక్రటరీ కోర్సులో ఏ. అక్షయ (966), టీ.రోషిని (966) మార్కులు సాధించగా, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సులో ఎం. లిఖిత (943), పి. శ్రీహరి (936) సాధించగా, ఎంపీసీ - 2 లో 1000 మార్కులకు గాను పి. జోష్న (981), వి.వర్షిత (951), వడ్ల వర్షిత (940) సాధించగా, బైపిసి-1 లో 470 మార్కులకు గాను వాలియా జబీన్ (428) సాధించగా, సిఇసి - 2 లో 1000 మార్కులకు గాను బి. సంజన (839) మార్పులను సాధించగా, హెచ్ఈసి-2 లో 1000 మార్కులకు గాను కె. మాలతి(882) మార్కులు సాధించారు.

**ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే సత్కారం..**

ఉత్తమ ఫలితాలతో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన విద్యార్థులను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ గౌడ్ కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాభ్యాసం ద్వారానే మనలోని అజ్ఞానాన్ని రూపుమాపవచ్చని నమ్మే మా నాన్నగారైన "కె. ఎం.పాండు" సంకల్పానికి నిదర్శనంగా ప్రతి నిరుపేద విద్యార్థులకు ఉపాధి కల్పనతో కూడిన ఉన్నత విద్యను అందించాలనే ధ్యేయంతో ఏర్పాటుచేసిన ఈ వొకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. విద్యార్థులు ఇదేవిధంగా ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్తును రూపొందించుకోవాలని ఆశీర్వదించారు. రానున్న రోజుల్లో నిరుపేద విద్యార్థులకు ఉపాధిని కల్పించే మరిన్ని కోర్సులను ప్రారంభించడంలో కళాశాల ప్రిన్సిపల్ లకు నా సహాయ సహకారాలు ఉంటాయన్నారు. విద్యార్థుల ప్రవేశాలకు అనుగుణంగా అదనపు తరగతి గదులను నిర్మింప చేస్తామని, సుదూర ప్రాంతాల నుండి విద్యాభ్యాసం కోసం పాఠశాలకు వచ్చే కళాశాల సిబ్బంది, విద్యార్థుల కోసం బస్టాప్ ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కేఎం.పాండు ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ షేక్ మైమూన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగేందర్, కళాశాల సిబ్బంది, వెలుగు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఫౌండర్ నారాయణరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేస్తున్న విమల స్కూల్.




**శిరివెళ్ల (నంది పత్రిక)**మండల పరిధిలోని గోవిందపల్లె గ్రామంలో గల విమల స్కూల్ చిన్నారి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేస్తున్నదని ప్రిన్సిపాల్ గీత సిస్టర్ తెలియజేశారు., గోవిందపల్లి గ్రామంలోని విమల స్కూల్ లో నర్సరీ నుండి 5వ తరగతి వరకు విద్య బోధన ఉన్నందున ప్రవేశాలు కొనసాగుతున్నాయని అన్నారు. పచ్చని చెట్లు ఆహ్లాదకరమైన వాతావరణం ఉత్తమ విద్య అత్యుత్తమ విద్యా బోధన క్రమశిక్షణకు మారుపేరుగా తమ విమల స్కూల్ బాలల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్నదని ప్రిన్సిపల్ గీత సిస్టర్ తెలియజేశారు. బాల్యము నుండి విలువలు విశ్వసనీయత క్రమశిక్షణ గల బావి భారత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలియజేశారు.

# కర్నూలు జిల్లా అభివృద్ధిపై మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇంచార్జిల సమావేశం



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూలు జిల్లా అభివృద్ధిపై జిల్లా ఇంచార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రి టీజీ భరత్ గుప్తా జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. విజయవాడలోని జలమండలి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తికొండ ఎమ్మెల్యే కె.ఈ శ్యాంబాబు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, ఆదోని ఇంచార్జి మీనాక్షి నాయుడు, మంత్రాలయం ఇన్చార్జి రాఘవేంద్ర రెడ్డి, ఆలూరు ఇన్చార్జి వైకుంఠం జ్యోతి పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా జిల్లా అభివృద్ధిపై చర్చించారు.

# కూకట్‌పల్లి ఇన్‌స్టామార్ట్‌లో డెలివరీ బాయ్స్ ఆగ్రహం





**కష్టపడేది మేమే, లాభాలు కంపెనీకే.. మాకు మాత్రం వేతనాల్లో కోత ఎందుకు? అంటూ నిరసన**

**కిలోమీటర్‌కు ఇస్తున్న పారితోషికాన్ని రూ.20 నుంచి రూ.15కు తగ్గించడం పై తీవ్ర ఆగ్రహం**

**12 గంటలు శ్రమించిన తర్వాత చేతికి వచ్చేది కేవలం రూ.600700 మాత్రమే పెట్రోల్, బైక్ మెయింటెనెన్స్, మొబైల్ ఖర్చులు కూడా తమ జేబు నుంచే పెట్టుకోవాల్సి వస్తుంది**

– కూకట్‌పల్లి లోని అల్విన్ కాలనీ ఇన్‌స్టామార్ట్ బ్రాంచ్ వద్ద డెలివరీ భాగస్వాములు భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. కిలోమీటర్‌కు ఇస్తున్న పారితోషికాన్ని రూ.20 నుంచి రూ.15కు తగ్గించడం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే పెరుగుతున్న పెట్రోల్ ధరలు, వాహన నిర్వహణ ఖర్చులు, జీవన వ్యయం భరించలేని స్థాయికి చేరుకున్న సమయంలో వేతనాలను తగ్గించడం కార్మికులపై ఆర్థిక దాడితో సమానమని వారు మండిపడ్డారు. డెలివరీ సిబ్బంది పలుమార్లు యాజమాన్యాన్ని, సీనియర్ మేనేజ్‌మెంట్ ను కలిసి తమ సమస్యలు వివరించినప్పటికీ ఎలాంటి పరిష్కారం చూపలేదని ఆరోపించారు. అంతేకాకుండా, "మీకు చేతనైతే చేసుకోండి, మా నిర్ణయం మారదు" అనే నిర్లక్ష్య ధోరణితో మాట్లాడారని వారు తెలిపారు.వర్షం అయినా, మండుటెండైనా, రాత్రి అయినా, పండుగ రోజులైనా ఆర్డర్లు సమయానికి చేరవేయడానికి ప్రాణాలకు తెగించి పనిచేస్తున్నామని, మూడో, నాలుగో అంతస్తుల వరకు ఎక్కి డెలివరీలు చేస్తున్నామని పేర్కొన్నారు. అయినప్పటికీ 12 గంటలు శ్రమించిన తర్వాత చేతికి వచ్చేది కేవలం రూ.600700 మాత్రమేనని, ఇందులో పెట్రోల్, బైక్ మెయింటెనెన్స్, మొబైల్ ఖర్చులు కూడా తమ జేబు నుంచే పెట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. డెలివరీ పూర్తయ్యాక తిరిగి వచ్చే ప్రయాణానికి ఎలాంటి చెల్లింపు లేకపోవడం వల్ల మరింత నష్టం వాటిల్లుతోందని వారు తెలిపారు. ఒక సాధారణ ఉద్యోగంలో 12 గంటలు పనిచేస్తే రూ.1,200 నుంచి రూ.1,300 వరకు వేతనం లభిస్తుందని, కానీ రోజంతా రోడ్లపై ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసే డెలివరీ కార్మికులకు కనీస గౌరవం కూడా దక్కడం లేదని విమర్శించారు."మా శ్రమతోనే కంపెనీలు కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నాయి. కానీ అదే కార్మికుల కడుపు పై కొట్టి వేతనాల్లో కోత విధించడం ఎంతవరకు న్యాయం?" అని ప్రశ్నించిన డెలివరీ సిబ్బంది, వెంటనే కిలోమీటర్ చెల్లింపును పాత విధానానికి తీసుకురావాలని, పెట్రోల్ ధరలు, పెరుగుతున్న జీవన వ్యయాలకు అనుగుణంగా పారితోషికాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం పట్టించుకోకపోతే, రాబోయే రోజుల్లో సేవలను నిలిపివేసి మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని డెలివరీ భాగస్వాములు హెచ్చరించారు.




# జూన్ 12న భీమవరంలో "ఒక నెల ఒక గ్రామం నాలుగు సందర్శనలు" మొదటి విడత కార్యక్రమం

## ఉదయం 10.00 గంటల నుంచి ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 10నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "ఒక నెల ఒక గ్రామం నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా జూన్ 12న భీమవరం నియోజకవర్గం భీమవరంలో ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు, వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# బిఆర్ఎస్ ఆధ్వర్యంలో తాగునీటి సమస్యపై జలమండలి కార్యాలయం ఎదుట ధర్నా




కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కుత్బుల్లాపూర్, జీడిమెట్ల డివిజన్ల ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలు, లో ప్రెషర్ సమస్య, నీటి సరఫరాలో తీవ్ర అంతరాయాలు, పారిశుధ్య నిర్వహణలో లోపాలు, డ్రైనేజీ వ్యవస్థ సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి ఏ.పి.హెచ్.బి కాలనీలోని జలమండలి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత కొంతకాలంగా కుత్బుల్లాపూర్, జీడిమెట్ల డివిజన్ల లోని అనేక కాలనీల ప్రజలు తాగునీటి సరఫరా సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా లో ప్రెషర్ తో నీటి సరఫరా కావడం, నిర్ణీత సమయాలకు నీరు అందకపోవడం వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. అలాగే పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం, డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతినడం వల్ల ప్రజారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ (జీఎం)ని కలిసి వినతిపత్రం సమర్పించారు. 131, 132 డివిజన్లలో తక్కువ నీటి ఒత్తిడి సమస్యను వెంటనే పరిష్కరించడం, తాగునీటి సరఫరాను క్రమబద్ధీకరించడం, పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడం, అవసరమైన చోట్ల డ్రైనేజీ పనులను చేపట్టడం వంటి అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జీఎం సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్, జీడిమెట్ల డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


# ట్రాఫిక్ రహిత సమాజం కోసం రాజీ లేని కృషి చేస్తాం

## ప్యాక్ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులలో వేగం పెంచాలి ప్యాక్ చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు చేపడుతున్న వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి లో జరుగుతున్న 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, సిఎంసి ఇంజనీరింగ్ విభాగం, జలమండలి అధికారులు మరియు ఎలక్ట్రికల్ విభాగం అధికారుల తో కలిసి పరిశీలించిన ప్యాక్ చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజుల రామరం వెళ్లే రోడ్డు వయా ఎల్లమ్మబండ రోడ్డు నిత్యం ట్రాఫిక్ సమస్య తో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు అని ,ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టడం జరిగినది అని, దానిలో భాగంగా తీసుకోవాల్సిన చర్యల పై గతంలో అధికారులతో కలిసి ఉషముళ్ళపూడి కమాన్ నుండి సిక్కుల బస్తీ వరకు పాదయాత్ర గా స్వయంగా నడుచుకుంటూ వెళ్లడం జరిగిన సంగతి విదితమే అని తెలియచేసారు. 100 ఫీట్ రోడ్డు విస్తరణలో ఉన్న అడ్డంకులను తొలగిస్తూ తీసుకోవాల్సిన చర్యల పై చర్చించి, ప్రణాళిక ను రూపొందించి రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, రోడ్డు మధ్యలో వచ్చిన బండ రాళ్ళ ను తొలగించడం జరుగుతుంది అని, రోడ్డు విస్తరణ పనుల వలన మంచి నీటి పైప్ లైన్ పగిలిపోవడం జరిగినది అని, మంచి నీటి పైప్ లైన్ పనులు వెంటనే పునరుద్ధరణ చేపట్టడం జరిగినది అని అధికారులను తెలిపా. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని, రోడ్డు విస్తరణ పనులు యుద్ధప్రాతిపదికన రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని, రోడ్డు విభాగిని పనులు నాణ్యత ప్రమాణాలు తో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, అధికారులను అదేశించడం జరిగినది. ఉషముళ్ళపూడి కమాన్ నుండి సిక్కుల బస్తి వరకు ఎల్లమ్మ బండ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన గల విద్యుత్ స్థంబాలను స్థాన భ్రంశం చేపట్టడం జరిగినది అని, అదేవిధంగా రోడ్డు డివైడర్ మధ్యలో సుందరికరణ పనులు చేపట్టాలని.ఎల్లమ్మబండ రోడ్డు లో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంది కావున విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని, రోడ్డుల విస్తరణ పనులు పై అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రోడ్డు మధ్యలో అడ్డంకిగా ఉన్న ఎలక్ట్రికల్ స్థంబాలను త్వరితగతిన స్థాన భ్రంశం చేయాలని, 100 ఫీట్ రోడ్డు విస్తరణ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా చూడాలని, ఈ100 ఫీట్ రోడ్డు విస్తరణ వలన ప్రజలకు సమయం, ఇంధనం ఆదా అవుతుంది అని, మౌలిక వసతుల కల్పనలో అలసత్వం ప్రదర్శించకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, సిఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ఈఈ గోవర్ధన్, ఏఈ సాయి యుగంధర్ రెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, జలమండలి డీజీఎం శ్రీనివాస్ రాజు,. ఎలక్ట్రికల్ డిఇ శ్యామ్, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఘనంగా జాజుల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు, బీసీ జేఏసీ చైర్మన్, జాజుల శ్రీనన్న జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ లోని సైఫాబాద్ బీసీ కార్యాలయంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముకురాల చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో శ్రీనన్న కి పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జె.ఎస్.పి యూట్యూబ్ ఛానల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముకురాల చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ జాజుల శ్రీనన్న బీసీ సమాజ సాధికారత కోసం నిరంతరం పోరాటం చేస్తున్న నాయకుడని, వారి సేవలు బీసీ ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. బీసీ వర్గాల అభ్యున్నతి కోసం వారు చేస్తున్న కృషి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీనన్న జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి, వారి దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు మరియు మరింత ప్రజాసేవ చేయగల శక్తి కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ బోదు శ్రీనివాస్ , ఉపాధ్యక్షులు రాసూరి జ్ఞానేశ్వర్ ,కోటజీ బీసీ జేఏసీ ప్రతినిధులు, వివిధ బీసీ సంఘాల నాయకులు, ఉద్యోగులు, యువజన ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ పై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం



అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధ్యక్షతన జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం పై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జిల్లా అదనపు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. ఉమా గౌరి, జిల్లాలో జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం కింద ఆరోగ్య శాఖ చేపడుతున్న నివారణ, నియంత్రణ చర్యలు, కార్యాచరణ ప్రణాళిక గురించి వివరించారు. అనంతరం జిల్లా ఎన్ వి బి డి సి పి ప్రోగ్రాం అధికారి డా. నాగరాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యక్రమం యొక్క లక్ష్యాలు, జిల్లాలో ప్రస్తుత పరిస్థితి, కార్యాచరణ ప్రణాళిక, చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో ఏర్పాటు చేసిన రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ల సభ్యుల వివరాలు, వారి విధులు, బాధ్యతలను వివరించారు. అలాగే వివిధ శాఖల మధ్య సమన్వయం, ఆయా శాఖల బాధ్యతలు, కీటక జనిత వ్యాధుల నియంత్రణలో వారి పాత్రను వివరించారు. ఆరోగ్య శాఖ తరఫున జిల్లాలో అందుబాటులో ఉన్న మందుల నిల్వలు, అవసరమైన వైద్య సామగ్రి, ఫాగింగ్ కార్యక్రమాలు, లార్వా నియంత్రణ చర్యలు, వ్యాధుల పర్యవేక్షణ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ గారు మాట్లాడుతూ పారిశుధ్యం, తాగునీటి సరఫరా, పర్యావరణ పరిశుభ్రత, అవగాహన కార్యక్రమాల నిర్వహణలో సంబంధిత అన్ని శాఖలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే మున్సిపల్ కమిషనర్లతో సమన్వయం చేసుకొని అవగాహన, పారిశుధ్య మరియు నివారణ చర్యలను మరింత విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఆరోగ్య శాఖతో పాటు టౌన్ ప్లానింగ్, ఫిషరీస్, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, ఎస్సీ వెల్ఫేర్, ఎస్టీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ శాఖల అధికారులు, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ ఓలు డా. లావణ్య, డా. గీత, డిప్యూటీ డెమో వసంత రెడ్డి, ఆరోగ్య శాఖకు చెందిన డీపీఎంవోలు, ఏపీఎంవోలు, యూనిట్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# నిఘా పెంచండి, డిస్పోజల్‌ను కొనసాగించండి

## రంగారెడ్డి సమీక్షా సమావేశంలో డిప్యూటి కమిషనర్ పి.దశరథ్ ఆదేశాలు





– నాటుసారాను పూర్తిగా కనిపించకుండా చేయాలని, ఇతర రాష్ట్రాల నుంచి ఎయిర్ పోర్ట్ ద్వారా, ఇతర మార్గాల ద్వారా వస్తున్న నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను పూర్తి స్థాయిలో అదుపు చేయాలని రంగారెడి ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ పి.దశరథ్ అన్నారు. బుధవారం ఆబ్కారీ భవన్ సమావేశ మందిరంలో రంగారెడ్డి డివిజన్ సమీక్షా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. రంగారెడ్డి ఉమ్మడి జిల్లాలోని ఐదు ఈఎస్ జిల్లాల పరిధిలో ఆశించిన రెవెన్యూను రావాలంటే ప్రధానంగా ఎక్సైజ్ స్టేషన్ బాధ్యుల తోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ టీమ్‌లు బాగా పని చేయాలని, నిఘా పెంచి మద్యం అమ్మకాలపై ప్రభావం చూపుతున్న నాటుసారా, నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్, ఫ్యూరియస్ లిక్కర్‌ను అరికట్టాలని ఆయన ఆదేశించారు. వీటితోపాటు సింథటిక్ డ్రగ్స్ అమ్మకాలు, వినియోగం, రవాణపై పటిష్ట నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని అన్నారు. వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయి, డ్రగ్స్, ఎన్‌పీడీఎల్ మద్యాన్ని , బెల్లం, గుడుంబాలను స్టేషన్లలో నిల్వ చేయకుండా డిస్పోజల్ చేయాలని, డిస్పోజల్‌కు అవసరమైన అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. వీటన్నింటిని అరికడితే తప్పా రెవెన్యూ పెరుగదని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో శంషాబాద్, సరూర్‌నగర్, మల్కాజిగిరి, మేడ్చల్, వికారాబాద్ ఎక్సైజ్ సూపరిటెండ్‌లు కృష్ణ ప్రియ, ఉజ్వలరెడ్డి, నవీన్, ఫయాజోద్దీన్, విజయ్ భాస్కర్‌గౌడ్ లతో పాటు ఏఈఎస్‌లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు, డీటీఎఫ్‌లు, సీఐలు పాల్గొన్నారు.

# కొల్లూర్ లోని వెంకటరమణ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి




బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి కొల్లూర్ లోని వెంకటరమణ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా మిల్లులో కొనసాగుతున్న ధాన్యం దిగుమతి, అన్‌లోడింగ్, నిల్వ ప్రక్రియలను క్షుణ్ణంగా అదనపు కలెక్టర్ పరిశీలించారు. పరిశీలనలో భాగంగా మిల్లర్లతో సమావేశమై, కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన వాహనాలను ఎటువంటి జాప్యం లేకుండా త్వరితగతిన అన్‌లోడ్ చేయాలని ఆదేశించారు. వాహనాలు మిల్లుల వద్ద ఎక్కువ సమయం వేచి ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి అవసరమైన మేరకు హమాలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. అదేవిధంగా, మిల్లర్ అక్‌నాలెడ్జ్‌మెంట్‌లను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే జారీ చేయాల, ధాన్యం దిగుమతి ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వాహనాల నిల్వ, అన్‌లోడింగ్, రసీదు జారీ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని ఆదేశించారు. మిల్లులో ధాన్యం నిల్వ పరిస్థితులు, హమాలీల అందుబాటు, వాహనాల కదలికలను అదనపు కలెక్టర్ స్వయంగా పరిశీలించి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలని మిల్లర్లకు స్పష్టం చేసారు. అనంతరం అదనపు కలెక్టర్ బొమ్మరాశిపేట లోని గోడౌన్‌ను పరిశీలించారు.

గోడౌన్‌కు ఇప్పటివరకు దిగుమతి అయిన ధాన్యం పరిమాణం పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, కొనుగోలు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

ఇందుకు అవసరమైన అదనపు గోడౌన్ లను వెంటనే గుర్తించి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# పోలీసుల నుంచి తప్పించుకోబోయి చెరువులోకి దూకాడు.. మొసలి నోటికి చిక్కాడు!

పోలీసుల నుంచి తప్పించుకోవాలని చేసిన ప్రయత్నం ఓ వ్యక్తికి ఊహించని షాక్ ఇచ్చింది. అరెస్టు నుంచి తప్పించుకునేందుకు చెరువులోకి దూకిన అతడిపై ఓ మొసలి దాడి చేసింది. అమెరికాలో జరిగిన ఈ విచిత్ర ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.అమెరికాలోని లూసియానా రాష్ట్రంలో విక్టర్ రివాస్ అనే 40 ఏళ్ల వ్యక్తి మద్యం మత్తులో కారు నడుపుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అతడు నడుపుతున్న టయోటా కారు రోడ్డుపక్కన ఉన్న కాంక్రీట్ డివైడర్‌ను ఢీకొట్టడంతో పాటు టైరు కూడా పేలిపోయింది. అనంతరం పోలీసులు ఆ వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించారు. అయితే రివాస్ కారును వదిలేసి కాలినడకన పారిపోయాడు. సమీపంలోని చెరువులోకి దూకి పోలీసులకు కనిపించకుండా తప్పించుకునే ప్రయత్నం చేశాడు. కొంతసేపటి తర్వాత పోలీసులు అతడిని గుర్తించినా మళ్లీ చిత్తడి ప్రాంతంలోకి పరిగెత్తాడు.అప్పుడే ఊహించని ఘటన జరిగింది. నీటిలో ఉన్న ఓ మొసలి వేగంగా అతడి వైపు దూసుకొచ్చి దాడి చేసింది. దీంతో రివాస్ రెండు చేతులకు గాయాలయ్యాయి. అయినప్పటికీ అతడు అక్కడి నుంచి మళ్లీ పారిపోయేందుకు యత్నించాడు. చివరకు డ్రోన్ సాయంతో అతడి కదలికలను గుర్తించిన పోలీసులు అరెస్టు చేశారు. గాయాల కారణంగా ముందుగా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మద్యం మత్తులో వాహనం నడపడం, పోలీసుల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించడం తదితర కేసులు నమోదు చేశారు. ఈ ఘటన తర్వాత సోషల్ మీడియాలో సరదా వ్యాఖ్యలు వెల్లువెత్తాయి. స్థానిక పోలీసు స్టేషన్ కూడా మొసలిని 'డిప్యూటీ ఆఫ్ ది ఇయర్'గా చూపిస్తూ రూపొందించిన ఏఐ చిత్రాన్ని పంచుకుంది. "మద్యం తాగి డ్రైవింగ్ చేయొద్దు.. పోలీసుల నుంచి పారిపోవొద్దు.. ముఖ్యంగా లూసియానా చెరువుల్లో దాక్కోవద్దు" అంటూ సరదాగా వ్యాఖ్యానించింది.



# భారతీయులున్న నౌకపై యూఎస్ దాడి

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, 24 మంది భారత సిబ్బంది ఉన్న వాణిజ్య నౌకపై అమెరికా బలగాలు జరిపిన దాడిని భారత్ తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనపై నిరసన వ్యక్తం చేస్తూ న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయ సీనియర్ దౌత్యవేత్తకు బుధవారం సమన్లు జారీ చేసింది. ఒమన్ గల్ఫ్‌లో జరిగిన ఈ ఘటనలో 21 మంది సిబ్బంది క్షేమంగా బయటపడగా, మరో ముగ్గురి ఆచూకీ ఇంకా లభించలేదని విదేశాంగ శాఖ అధికారికంగా వెల్లడించింది. పలావు జెండాతో ఉన్న 'ఎంటీ మారివెక్స్' అనే ఆయిల్ ట్యాంకర్‌ను లక్ష్యంగా చేసుకుని అమెరికా ఈ దాడికి పాల్పడింది. ఇరాన్‌పై విధించిన ఆంక్షలను ఉల్లంఘించి ఆ నౌక ప్రయాణించిందని, తమ ఆదేశాలను పాటించకపోవడంతో ఇంజిన్ రూమ్‌ను ధ్వంసం చేసేందుకు దాడి చేయాల్సి వచ్చిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ప్రకటించింది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ యుద్ధనౌక నుంచి బయలుదేరిన ఎఫ్-18 ఫైటర్ జెట్ ఈ దాడిలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. దాడి జరిగిన తరుణంలో నౌకలోని భారత సిబ్బంది పంపిన అత్యవసర సందేశాలు ఆందోళన తీవ్ర ఆందోళన కలిగించాయి. "మా నౌకపై అమెరికా నేవీ క్షిపణి దాడి చేసింది. దీనివల్ల ఇంజిన్ రూమ్ దెబ్బతినడమే కాకుండా, నౌక కింద భాగంలో రంధ్రం పడింది. మేమంతా 24 మంది భారతీయ సిబ్బంది ఉన్నాం, దయచేసి త్వరగా మమ్మల్ని రక్షించండి" అంటూ వారు వేడుకున్నారు. ఈ సమాచారం అందిన వెంటనే స్పందించిన ఒమన్ నావికాదళ, హెలికాప్టర్ల ద్వారా సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. ఈ పరిణామాలను భారత విదేశాంగ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోంది. గల్లంతైన ముగ్గురు సిబ్బంది కోసం ఒమన్ అధికారుల సమన్వయంతో గాలింపు చర్యలను ముమ్మరం చేసినట్లు వెల్లడించింది. సమస్యాత్మక జలాల్లో ప్రయాణించే భారతీయ పౌరులు, వాణిజ్య నౌకల భద్రతకే తమ ప్రథమ ప్రాధాన్యత అని భారత్ స్పష్టం చేసింది. ఇరాన్‌తో నెలకొన్న విభేదాల నేపథ్యంలో అమెరికా ఆంక్షలను కఠినంగా అమలు చేస్తుండటంతో, ఈ ప్రాంతంలో తరచూ ఇటువంటి ఉద్రిక్త ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.



# 5 కిలోమీటర్ల పరిధిలోని వారికే 2 బిహెచ్ కె ఇండ్ల కేటాయింపు





**2బిహెచ్ కె ఇండ్లలో లేని వారికి నోటీసులు**

**నిర్మాణపు పనులను త్వరతిగతిన పూర్తి చేయాలి**

**హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతం కలెక్టర్ తో కలిసి 2 బిహెచ్ కె కాలనీల్లో విస్తృతంగా పర్యటన**

మంచి లే అవుట్లు, అన్నిరకాల మౌలిక వసతులతో నిర్మించి మంజూరు చేసిన డబుల్ బెడ్ రూం ఇండ్లలో లబ్ధిదారులు అందరూ నివసించేలా చూడాలని, ఇండ్లు కేటాయించినా ఈ కాలనీల్లోకి షిఫ్టు కాని వారందరికీ మరోసారి నోటీసులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి వి.పి.గౌతం అధికారులను ఆదేశించారు. వివిధ దశల్లో ఉన్న 2 బిహెచ్ కె కాలనీల్లోని పనులన్నిటినీ త్వరతగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తో కలిసి పలు 2 బిహెచ్ కె కాలనీల్లో పర్యటించి పనుల పురోగతిని సమీక్షించారు. బౌరంపేట, గండిమైసమ్మ, దుండిగల్ లోని 2 బిహెచ్ కె కాలనీల్లో పర్యటిస్తూ ఆయా కాలనీల్లో నివసిస్తున్న వారితో మాట్లాడారు. దుండిగల్ ఫేజ్ -1 , డబుల్ బెడ్ రూం కాలనీలో పర్యటించి అక్కడి మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. ఇండ్లను కేటాయించిన లబ్ధిదారుల్లో ఇంకా చాలా మంది ఇక్కడ నివాసం ఉండని విషయాన్ని తెలుసుకుని, వారందరూ ఇక్కడికి తరలివచ్చేలా చొరవ చూపాలని, ఇక్కడ నివసించకపోతే ఇంటి రద్దు చేస్తామని మరోసారి నోటీసులు ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగు పడాలని, వారికి సమాజంలో గౌరవం పెరిగేలా సొంత ఇంటి వసతిని కల్పించే లక్ష్యంతో చేపడుతున్న గృహ నిర్మాణ పథకాలని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన స్థానికులకు వివరించారు. తమకు ఇండ్లు కావాలని వేల మంది ప్రజలు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసినా ఉండటానికి ముందుకు రానివారికి కేటాయింపులను రద్దు చేసి అర్హులైన ఇతరులకు ప్రయోజనం కలిగిస్తామని స్పష్టం చేశారు. అట్లాగే దుండిగల్ ఫేజ్-2 కాలనీల్లోని పనుల పురోగతిని పరిశీలించి, త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. మౌలిక వసతుల పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. 2బిహెచ్ కె కాలనీల్లోని ఇండ్లను, సమీపంలోని 5 కిలోమీటర్ల పరిధిలో నివసించే వారికే కేటాయించాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకున్నదని ఈ మేరకు లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతున్నదని ఎండి గౌతం తెలిపారు. స్థానికంగా గండిమైసమ్మ ప్రాంతంలో ఇందుకు సంబంధించి జరుగుతున్న సర్వే ప్రక్రియను అధికారులు పరిశీలించారు. ప్రజా పాలన సందర్భంగా తమకు ఇల్లు కావాలంటూ దరఖాస్తు చేసుకున్న వారిలో ఇంటి స్థలం- సొంత ఇల్లు లేని (ఎల్-2) జాబితాలో ఉన్న వారికి 2 బిహెచ్ కె ఇండ్లను కేటాయించేందుకు వీలుగా, ప్రభుత్వ తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన వారిని



గుర్తించేందుకు తహశీల్దార్లు ఇతర అధికారుల ద్వారా కొద్దిరోజులుగా సర్వే నిర్వహిస్తున్నారు. గండిమైసమ్మ ప్రాంతంలో అధికారులు నిర్వహిస్తున్న సర్వేను అధికార బృందం పర్యవేక్షించింది. సర్వే వివరాలను సమగ్రంగా, యాప్ లో అప్ లోడ్ చేస్తున్నారా లేదా, అర్హతల నిర్ధారణ ప్రక్రియ తదితర అంశాలను గమనించి, సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సర్వే అనంతరం, యుద్ధప్రాతిపదికన ముందుగా 2 బిహెచ్ కె ఇండ్లకు లబ్ధిదారుల ఎంపికను చేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరికి, ప్రత్యేక కార్యదర్శి సూచించారు. ఈ పర్యటనలో హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ ఎం.చైతన్యకుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్ విజయకుమార్, హౌసింగ్ బోర్డు చీఫ్ ఇంజనీర్ జి.వి.రమణారెడ్డి, జిల్లా హౌసింగ్ పిడి రమణమూర్తి, ఇంజనీర్లు పి.వి.రవీందర్ తోపాటు, స్థానిక రెవెన్యూ, వాటర్ వర్క్, విద్యుత్ శాఖ లకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# సంపద కార్పొరేట్‌లకు, భారాలు ప్రజలకు

# ఇదే మోడీ ఆర్థిక విధానం



**: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వియస్.బోస్**

**ధరల దోపిడీ పై, ప్రజలపై మోపిన భారాన్ని వెంటనే తగ్గించాలి**

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ముందు సీపీఐ ఆధ్వర్యంలో భారీ నిరసన ధర్నా**

దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, విద్యుత్ చార్జీలు, విద్యావైద్య ఖర్చులు నిరంతరం పెరుగుతూ సామాన్య ప్రజల జీవనాన్ని దుర్భరంగా మారుస్తున్నాయని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ధరల నియంత్రణలో పూర్తిగా విఫలమయ్యాయని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తీవ్రంగా ఖండిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వియస్.బోస్ అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సమితి పిలుపులో భాగంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వియస్.బోస్ మాట్లాడుతూ ప్రజల జీవన వ్యయం ఎంత బాగా పెరిగిందని, 2014లో సుమారు రూ.410 ఉన్న గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1,150 దాటిందన్నారు, అంటే 100 శాతానికి పైగా పెరుగుదల అయిందన్నారు. పెట్రోల్ ధరలు లీటర్‌కు రూ.70 నుండి రూ.117కు చేరుకున్నాయని, డీజిల్ ధరలు కూడా భారీగా పెరిగాయన్నారు. వంటనూనె ధరలు కొన్నేళ్లలో లీటర్‌కు రూ.90100 నుండి రూ.170200 వరకు పెరిగాయని, పప్పుధాన్యాలు, కూరగాయలు, పాలు, గుడ్లు, బియ్యం ధరలు కూడా నిరంతరం పెరుగుతుండటంతో ఒక మధ్యతరగతి కుటుంబం నెలవారీ ఖర్చు గత దశాబ్దంలో దాదాపు రెట్టింపు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో "అచ్చే దిన్", "అభివృద్ధి" పేరుతో గొప్పలు చెప్పిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ నేడు ధరల పెరుగుదలపై ఒక్క మాట మాట్లాడటం లేదన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గినప్పుడు పెట్రోల్, డీజిల్ ధరలు ఎందుకు తగ్గడం లేదన్నారు. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రాయితీలు ఇచ్చే ప్రభుత్వాలకు ప్రజలకు సబ్సిడీలు ఇవ్వడం భారంగా ఎందుకు కనిపిస్తోందని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోతే, మార్కెట్లో మాత్రం అధిక ధరలకు ఎవరు బాధ్యులు అని వారు ప్రశ్నించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వాలు కనీసం ధరలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమవుతున్నాయన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోతుంటే ప్రభుత్వాలు ఎవరికి పాలన చేస్తున్నాయని, దేశ సంపద కొద్దిమందికే కష్టాలు కోట్లాది ప్రజలకా అని వారు ఏద్దేవా చేశారు. ఒకవైపు కొద్దిమంది కార్పొరేట్ సంస్థల సంపద లక్షల కోట్ల రూపాయల మేర పెరుగుతుంటే, మరోవైపు సాధారణ కుటుంబాలు నెలాఖరు ఖర్చులు తీర్చలేని పరిస్థితికి చేరుకున్నాయన్నారు. ఇది ప్రభుత్వాల కార్పొరేట్ అనుకూల విధానాల ఫలితమేనని వారు ఆరోపించారు.

**సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్..**

ప్రజల కష్టాలు పట్టించుకోకుండా ప్రచార ఆర్భాటాలకు, కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని సీపీఐ హెచ్చరిస్తోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే నియంత్రించాలని, పెట్రోల్, డీజిల్, ఎల్పిజి గ్యాస్ ధరలను తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, రైతులకు గిట్టుబాటు ధరలు, వినియోగదారులకు సరసమైన ధరలు అందించాలని, విద్య, వైద్యం, విద్యుత్, రవాణా రంగాలలో ప్రజలపై పడుతున్న భారాన్ని తగ్గించాలని, నిల్వదారులు, కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు





డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సిపిఐ కార్యవర్గం జిల్లా డి ఆర్ ఓ మాలతీ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ ధర్నాలో ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. సీపీఐ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువజనులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ధరల పెరుగుదలపై ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు వెంటనే చర్యలు చేపట్టకపోతే సీపీఐ ఆధ్వర్యంలో మరింత ఉధృతమైన ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు జీ.దామోదర్ రెడ్డి, డీజీ. సాయిలు గౌడ్, తోటపల్లి శంకర్, హరినాథ్ రావు, కె.స్వామి, టి.సత్య ప్రసాద్, రచ్చ కిషన్,నిమ్మల నర్సింహా, యాదయ్య గౌడ్, కృష్ణ, లక్ష్మీ, ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.లక్ష్మణ్, మండల కార్యదర్శులు, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# 370 రద్దుతో ..నెహ్రూ రికార్డును అధిగమించిన మోడీ !

భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే మున్నెన్నడూ చూడని ఒక అరుదైన మైలురాయి ఆవిష్కృతం అయ్యింది. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ పేరిట ఏడు దశాబ్దాలుగా చెక్కుచెదరకుండా ఉన్న అత్యధిక కాలం ఎన్నికైన ప్రధాని రికార్డును ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోడీ బద్దలు కొట్టారు. ఇక ప్రధానిగా మోడీ సాధించిన విజయాలు అనేకం ఉన్నాయి. ఇవన్నీ కూడా భారతదేశ చరిత్ర గతిని తిప్పేవని చెప్పుకోక తప్పదు. ప్రధానంగా నెహ్రూ 370 ఆర్టికల్ పెట్టి కశ్మీర్‌ను ఇండియాకు దూరం చేస్తే..అదే 370ని రద్దు చేయడం ద్వారా ప్రధాని మోడీ చారిత్రక నిర్ణయం తీసుకుని, కాశ్మీర్‌ను భారత్‌లో సంపూర్ణంగా విలీనం చేశారు. అలాగే కాశ్మీర్ ఇప్పుడు సంపూర్ణంగా విలీనం కావడంతో పాటు, అక్కడ వేర్పాటువాద, ఉగ్రవాద మూకలను ఉక్కుపాదంతో ఇవి ... క్రూకటి వేళ్లతో పెరివేశారు. మోడీ ధృఢ సంకాల్పినికి...చరిత్రాత్మక నిర్ణయానికి ఇది నిదర్శనంగా చూడాలి. పటేల్ తరహాలో దేశంలో ఐక్యత సాధించే యత్నాలను నేటికీ మోడీ కొనసాగించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. 2014 మే 26న ప్రమాణ స్వీకారం చేసిన మోడీ.. వరుసగా మూడు సార్లు అధికారంలోకి వచ్చి, సందిగ్ధ రాజకీయ పరిస్థితులను దాటుకుంటూ సగర్వంగా 4,399 రోజులు పూర్తి చేసుకోవడం చిన్న విషయం కాదు. తద్వారా దేశ రాజకీయాల్లో ఒకే ఒక్కడుగా కొత్త చరిత్ర సృష్టించారు. ఈ క్రమంలో భారత రాజకీయాల్లో జూన్ 10, 2026 ఒక సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా నిలిచిపోనుంది. ఆ రోజుతో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ చరిత్రలోనే అత్యధిక కాలం సేవలు అందించిన నేరుగా ప్రజలు ఎన్నుకున్న ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించారు. స్వతంత్ర భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న 12 ఏళ్ల 14 రోజుల రికార్డును ప్రధాని మోడీ అధిగమించారు. అంతేగాకుండా అందరికీ దూరంగా,అంటరాని పార్టీగా ఉన్న బిజెపిని ప్రజల్లోకి తీసుకెళ్లిన ఘనత కూడా మోడీదని చెప్పాలి. అందుకు ఆయనకు కుడిభుజంగా పనిచేస్తున్న అమిత్ షా వ్యూహాలను కూడా తక్కువ చేయలేం. ఈ ఇద్దరి జంట దేశంలో భారతీయ జనతాపార్టీ పునాదులను బలోపేతం చేసిందనడంలో సందేహం లేదు. ఇక మోడీ తీసుకున్న నిర్ణయాల్లో మరోటి అయోధ్య సమస్యకు చెక్ పెట్టడం. రావణ కాష్టంలా ఉన్న అయోధ్య సమస్యను సుప్రీం కోర్టు ముందుంచి పరిష్కరించగలగడం చారిత్రాత్మక విజయంగా చూడాలి. కోటానుకోట్ల హిందువుల గుండెల్లో ఇది చిరస్మరణీయ నిర్ణయంగా నిలిచిపోయింది. ట్రిపుల్ తల్లాక్ వంటి అనాగరిక చట్టాలను కూడా రద్దు చేయడం ద్వారా ముస్లిం మహిళలకు అండగా నిలబడ్డారు. ప్రధానంగా ఉమ్మడి పౌరస్మృతి కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తే.. భారత్‌లో విభజన రాజకీయాలకు చెక్ పడనుంది. అలాగే మహిళా బిల్లును గట్టెక్కించే ప్రయత్నంలో ఓ అడుగు పడింది. అంతేకాకుండా అంతర్జాతీయంగా యోగా దినోత్సవాన్ని జూన్ 21న నిర్వహించేలా ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానం మోడీ ప్రతిభకు నిదర్శనంగా చూడాలి. అలాగే అనేక దేశాల్లో పర్యటించి భారత్ ప్రతిభను చాటడమే గాకుండా ఆయా దేశాలతో సంబంధ బాధంవ్యాలను బలోపేతం చేయడంలో అద్భుత విజయం సాధించారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రధానిగా జవహార్‌లాల్ నెహ్రూ దేశంపై తనదైన ముద్ర వేశారు. ఆయన కూడా అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. తొలి ప్రధానిగా నెహ్రూపై దేశ పునర్నిర్మాణ బాధ్యత లు పడ్డాయి. అదే స్వతంత్ర భారతాన్ని పటిష్ఠమైన పునాదులతో పదిలంగా నిర్మించడం.. అంతేకాదు పేదరికంలో మగ్గిపోతున్న, శతాబ్దాల బానిసత్వంతో ఆత్మవిశ్వాసం కోల్పోయిన జాతిని సగర్వంగా తలెత్తుకు నిలిపేలా చేయడం. ఇవి మరే ప్రధానికీ ఎప్పుడూ ఎదురుకాని కఠిన సవాళ్లు అనడంలో సందేహం లేదు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్ని సమర్థంగా నిభాయించిన నెహ్రూ.. దేశంపై చెరిగిపోలేని ముద్ర వేశారు. అందుకు

ఆనాటి ఉప ప్రధాని పటేల్ చేదోడువాదోడుగా నిలిచారు. సంస్థానాలను విలీనం చేసి దేశాన్ని ఐక్యంగా నిలబెట్టారు. అంతకుముందు స్వాతంత్రోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన నెహ్రూ.. ఆ తర్వాత స్వతంత్ర భారత తొలి ప్రధానిగా.. అటు స్వయంత్ర సమరయోధుల ఆశయ సాధనకు, ఇటు దేశ ప్రజల ఆకాంక్షలకు పెద్దపీట వేస్తూ.. పాలన సాగించారనడంలో సందేహం లేదు. అయితే పదవీకాలం ప్రకారం ఇన్నాళ్లుగా చెక్కుచెదరని చారిత్రక రికార్డు నెహ్రూ పేరిట ఉండగా ప్రధాని మోడీ ఇప్పుడు దానిని అధిగమించారు. ప్రజాస్వామ్య ఎన్నికల్లో నెహ్రూ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రజాప్రతినిధిగా ఎన్నికై దేశానికి ప్రధాన మంత్రిగా ప్రాతినిధ్యం వహించారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత నుంచి ఇప్పటిదాకా 15 మంది ప్రధాన మంత్రులు గా ప్రాతినిధ్యం వహించారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో బీజేపీ తరఫున నరేంద్రమోడీ సుదీర్ఘకాలం పనిచేసిన ప్రధానమంత్రిగా అరుదైన రికార్డును కొన్నేళ్ల క్రితమే సొంతం చేసుకున్నారు. ఇప్పుడు నెహ్రూ రికార్డును అధిగమించారు. అలాగే కోట్లాది మంది భారతీయులకు ఆరాధ్యనేతగా ఎదిగారు. ఇది ఆషామాషీ విషయం కాదు. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించడం మామూలు విషయం కాదు. ఇది దేశ చరిత్రలోనే ఓ అరుదైన మైలురాయిగా నిలిచిపోనుంది. 2014లో ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన నరేంద్రమోడీ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు ఆయనను ప్రజలకు చేరువ చేస్తున్నాయి. 370 రద్దు, ట్రిపుల తలాక్ రద్దు, అయోధ్య, మహిళా బిల్లు వంటివన్నీ మోడీకి జననీరాజనం పట్టేలా చేసినవే. దేశంలో రాష్ట్రప్రభుత్వ అధినేతగా.. దేశాధినేతగా నరేంద్రమోడీది ఎవరికీ సాధ్యంకాని రికార్డు నెలకొల్పారు. గుజరాత్ ముఖ్యమంత్రి గా నరేంద్ర మోడీ దేశానికి రోల్ మోడల్ అయ్యారు. అలాగే ముఖ్యమంత్రి మంత్రి పదవికి రాజీనామా చేసి దేశానికి ప్రధాన మంత్రి అయ్యారు. సమర్థ నాయకత్వం..సుస్థిర పాలనతో భారత రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక మైలురాయిని సాధించారు. 25 ఏళ్ల రాజకీయ అనుభవంతో ప్రభుత్వ పాలనలో వివిధ రికార్డుల్ని బ్రేక్ చేశారు. సరికొత్త రికార్డులను నెలకొల్పి సంచలన నిర్ణయాలకు కారకులయ్యారు. సాంకేతికం గా చూస్తే నెహ్రూ మొత్తం ప్రధానిగా ఉన్న కాలం మోడీ కంటే కచ్చితంగా ఎక్కువే. కానీ నెహ్రూ మొదటి సారి 1947లో మధ్యంతర ప్రభుత్వానికి ప్రధానిగా ఉన్నారు తప్ప నేరుగా ప్రజల ద్వారా ఎన్నిక కాలేదు. కానీ, 2014 మే 26న మొదటిసారి నేరుగా ప్రజా బ్యాలెట్ ద్వారా ఎన్నికై ప్రధాని పీఠం అధిరోహించిన నరేంద్ర మోడీ, నాటి నుంచి నేటి వరకు నిరంతరాయంగా ప్రజామోదంతోనే ఈ రికార్డు సొంతం అయ్యింది.

# ప్రజాస్వామ్యంలో వరుస విజయాలు అరుదు

ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల్లో విజయం సాధించడం, ప్రజానేతగా గుర్తింపు పొందడం అరుదైన విషయం. ఏ పార్టీ అయినా.. ఏ నేత సామర్థ్యానికైనా ఇదే గీటురాయి. అందుకే గెలుపు కోసం రాజకీయ పార్టీలన్నీ నానా తిప్పలు పడుతుంటాయి. రాష్ట్రాల్లో విజయం సాధించటానికే అనేక ఢక్కామొక్కీలు తినాలి. ఇక దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించడం ఆషామాషీ విషయం కానే కాదు. దేశ రాజకీయాల్లో రాణించడం, సమర్థ నాయకత్వం-సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఆషామాషీకాదు. ఒక్కసారి ఎలాగోలా గెలిచినా.. వరుసగా రెండోసారి గెలవడం అంత తేలిక కాదు. అలాంటిది వరుసగా మూడోసారి కూడా జయకేతనం ఎగరవేయటం అన్నది కేవలం మోడీకి మాత్రమే సాధ్యమయ్యింది. పుష్కరకాలంగా ప్రధానిగా కొనసాగిన తర్వాత కూడా.. ఇప్పటికీ దేశంలో అత్యంత ఆదరణ ఉన్న నేతగా మోడీ నిలిచారు. కొన్నాళ్ల క్రితమే అత్యధిక కాలం పదవిలో ఉన్న ప్రభుత్వాధినేతగా మోడీ రికార్డు సృష్టించారు. . ఇప్పుడు అత్యధిక కాలం పదవిలో ఉన్న ఎన్నికైన ప్రధానిగా కొత్త రికార్డును తన పేరున లిఖించుకున్నారు. కాంగ్రెసేతర ప్రధానుల రికార్డులన్నీ తన రెండో టర్మ్‌లోనే బద్దలు కొట్టిన మోడీ.. గతేడాది కాంగ్రెస్ ప్రధానుల రికార్డులు బద్దలు కొట్టే పని మొదలు పెట్టారు. మునుపటి ఏడాది ప్రధానిగా ఇందిర రికార్డు బ్రేక్ చేసిన మోడీ.. ఇప్పుడు నవ భారత నిర్మాత నెహ్రూ రికార్డును అధిగమించారు. నరేంద్ర మోదీ 2014 మే లో తొలిసారి, ఆ తర్వాత వరుస విజయాలతో నేరుగా ప్రజామోదం పొందారు. మోదీ సాధించిన ఈ ఘనతకు ఆయన నాయకత్వ పటిమ, దేశవ్యాప్తంగా ఆయనకు ఉన్న తిరుగులేని ప్రజాదరణెళి ప్రధాన కారణంగా చూడాలి. మోడీ హయాంలో దేశం దశాబ్దాల నాటి సంకీర్ణ రాజకీయాల అస్థిరత నుంచి బయటపడి పటిష్టమైన రాజకీయ సుస్థిరత వైపు అడుగులు వేసింది. ఈ సుస్థిరత వల్లే జీఎస్టీ లాంటి క్లిష్టమైన పన్ను సంస్కరణలు, డిజిటల్ ఇండియా విప్లవం, బ్యాంకింగ్ రంగ ప్రక్షాళన వంటి సంచలన నిర్ణయాలు సాధ్యమయ్యాయి. జాతీయ భద్రత విషయంలో రాజీలేని వైఖరిని ప్రదర్శిస్తూ ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు వంటి చరిత్రాత్మక నిర్ణయాలతో దేశ అంతర్గత రాజకీయ స్వరూపాన్ని మోడీ మార్చివేశారు. ఇపుడు ప్రధాన మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నరేంద్ర మోడీ 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి 2014 మే 21 వరకు ఆ పదవిలో కొనసాగారు. జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించే ముందు 13 సంవత్సరాలకు పైగా గుజరాత్ రాష్ట్రానికి నాయకత్వం వహించారు. 2014 మే 26న భారతదేశ 14వ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో లోక్‌సభలో పూర్తి మెజారిటీ సాధించిన తొలి కాంగ్రెసేతర నాయకుడిగా నరేంద్ర మోడీ నిలిచారు. ఆ తర్వాత, రెండు పూర్తి పదవీకాలాలు పూర్తి చేసి, వరుసగా మూడోసారి తిరిగి ప్రధానమంత్రి అయిన తొలి కాంగ్రెసేతర ప్రధానమంత్రిగా కూడా ఆయన చరిత్ర సృష్టించారు. 2014లో ఎన్డీఏ కూటమి ద్వారా కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నరేంద్రమోడీ..

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com